మార్చి - 2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక


గౌరవ సంపాదకులు :

**కె. సామ్యేల్ రాజేంద్ర**

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. **350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



బ్యాంక్ అకౌంట్ వివరాలు :

A/c Name: **K. Emmanial Rajendra**


A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890



## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పత్పనేహు | కొడవటికంటి | 03 |
| వేరీజ్ యువర్ హార్ట్ | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 07 |
| రక్తస్రావరోగం గల స్త్రీ | హన్నాకృప డెస్క్ | 09 |
| ఉపవాసం | హన్నాకృప డెస్క్ | 11 |
| స్వస్థపరచిన దేవుడు | సాక్ష్యం | 13 |
| కాలానికి కేంద్రం క్రీస్తే | ఎ.యన్.ఆర్.జక్కం | 15 |
| నెరవేరిన కల | చిన్నపిల్లల పేజి | 16 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| మనల్ని మనం పరీక్షించుకోవాలి | హన్నాకృప డెస్క్ | 20 |
| దేవుడు - సిరి | హన్నాకృప డెస్క్ | 21 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పత్రిక | | 24 |


సీరియల్ నంబరు

# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు  కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

అప్పుడే మార్చి నెలలో ప్రవేశించాము. పరీక్షలు వ్రాయడానికి ఈ నెల కొరకు విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. పరీక్షలు, టెన్షన్లు. ఎప్పుడూ ప్రార్థించని వారు కూడా ప్రార్థనలు చేసున్నారు.

క్రొత్త మనల్ని భయపెడుతుంది. రేపటి రోజు మానవులకు క్రొత్తరోజు. రేపు ఇంతకముందు ఎన్నడూ రాలేదు. మరలా మన కొరకు రాదు. మనల్ని వెంబడిస్తూ, భయపెడుతూ వస్తున్న క్రొత్తరోజును చూసి భయపడవద్దు అన్నాడు ప్రభువు. రేపటిని గూర్చి చింతింపకుడి రేపటి దినము దాని సంగతులను గూర్చి చింతించును అన్నాడు.

అసలు మనుష్యులు భయపడటానికి ముఖ్యకారణం దేవుని మరచిపోవటం. మనం మరణించేటంత వరకు మనల్ని విడువక ఎడబాయక కాపు కాస్తున్న దేవుని వాగ్దానాన్ని గ్రహించకపోవటం. యెహోవా నా కాపరి అని నమ్మకపోవటం. కొందరు అన్ని విషయాలలో సమృద్ధిగా ఉండినా, వారికి రేపు అనే విషయం ఆందోళన కలిగిస్తుంది. కొందరు వచ్చేవారం గురించి, మరికొందరు వచ్చే నెల గురించి, మరి కొందరు వచ్చే సంవత్సరం గురించి భయపడతుంటారు. అందుకే ప్రభువు ఏనాటి కీడు ఆనాటికే చాలును అన్నాడు. అంటే మనం ఈ రోజు విషయం సంతృప్తి కలిగి ఉండమని. అన్నిటికంటే ముఖ్యమైనది మనం విడిచి వచ్చిన మార్గము మనం మరచిపోతుంటాము. మనం నడవబోయే మార్గాన్ని గురించి దిగులు పడటానికి కారణం ఇదే. కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రభువునుబట్టి ధైర్యముగా ఉండమని మనవి చేస్తున్నాను.

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరు చున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును.  మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు **9440217726** నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి  సామ్యేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra,  SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

సీరియల్



# జఫ్నత్పనేహు

(యోసేపు జీవితచరిత్ర)

- కొడవటికంటి

గాజాకు వచ్చేటప్పుడు కొంచెం దూరంలో గాజా కొండ కనబడుతూనే ఉంది. గాజాలో ఎక్కువమంది నెఫీలులు ఉన్నారని తన ఇంటి ముఖ్య సేవకుడు చెప్పేవాడు. గాజా ఒక చక్కని గుండ్రని కొండమీద, సముద్రానికి రెండున్నర మైళ్ళ దూరంలో కట్టబడి ఉంది. దూరంగా గుండ్రని బంతిలా కనబడే గాజా పట్టణం కొండ దగ్గరికి వచ్చే కొద్దీ పెద్ద పెద్ద మేడలతో, పూల తోటలతో, కనిపిస్తుంది. అనేకరకాలైన సాంస్కృతిక కార్యక్రమాలతో నిండి ఉంది. ఈ గాజా బబులోను నుండి యెబూసు మీదుగా కాకట్ వెళ్ళే రాజబాట మీద ఉంది. హారాను నుండి నజరేతు మీదుగా ఐగుప్తు వెళ్ళే రాజమార్గములో ఉంది. ఈ పట్టణంలో ఉన్న మంచి సత్రము, విలువైన సదుపాయాలు, విచ్చల విడిగా ఈ లోకసంబంధాలు - యాత్రికులను తొందరగా ఈ పట్టణాన్ని దాటనివ్వవు.

యోసేపు గాజాలో చివరివరకు వెళ్ళాడు. పడమర మహాసముద్రం కనబడుతుందే కాని యొప్పేలో వలె ఓడలు కనిపించలేదు. దక్షిణాన ఐగుప్తుకు వెళ్ళే రథాలు, యాత్రికులు కనిపిస్తున్నారు. విలువైన పెద్ద రథాలు, సైనికులు, కాకట్ నుండి రాజమార్గం కనబడుతున్నాయి. తను నిలబడ్డ కొండ చివర్లో ఒక చిన్న దేవాలయం ఉంది. అది దాగోను దేవాలయం. అక్కడ ఏదో జాతర జరుగుతున్నట్లుంది. నాట్యం ఆడుతున్నారు. అటు వెళ్ళటం ఇష్టం లేక తూర్పుగా ఉన్న ఒక కొన మీదకు నడిచాడు. కొంచెం తూర్పుగా వంగివున్న శిఖరం మీదుగా వియాన్‌ను చేయి పట్టుకొని నడిపిస్తున్నాడు. వియాన్‌కి కొండల మీద తొందరగా నడవటం రాదు. యోసేపు కొండల మీద నడవటం షెకెములో నేర్చుకున్నాడు.

యోసేపుకు గుండె ఆగిపోయినట్లయింది. అది తూర్పు తీరం. "వియాన్!" అని పెద్దగా అరిచాడు. వియాన్ ఆశ్చర్యపోయాడు. ఎప్పుడూ చిన్న గొంతుతో మాట్లాడే యోసేపు అకస్మాత్తుగా ఇంత పెద్దగా ఎందుకు అరుస్తూ మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. యోసేపు కొండ కొనకు ఇంకా తొందరగా నడుస్తున్నాడు. ఎడమచేత్తో తన అంగీని మోకాళ్ళపైదాకా లాక్కుంటూ, పైకి పోతూ "వియాన్... వియాన్...వియాన్ తొందరగా రా!" అంటూ అరుస్తున్నాడు. అప్పటికే వియాన్ యోసేపు యొక్క ఆరాటం చూస్తూ తనని తాను తమాయించుకోలేని స్థితిలో శిఖరం మీద నుండి జారిపడి చచ్చిపోతాడేమోననే భయంతో ఒక్క ఉదుటున యోసేపును పట్టుకున్నాడు. కాని యోసేపు ఇదేమి పట్టించుకోకుండా "వియాన్..వియాన్...! ఇదిగో తూర్పున కొండ చూడు. అది మా పడమటి కొండ దాని వెనకాలే రోజూ సూర్యుడు సాయంకాలం మాయమైపోతుంటాడు. అరెరె...! దాని అవతలనే హెబ్రోను ఉంది. ఇప్పుడు అక్కడ మా నాయన చచ్చిపోయి ఉంటాడు. మా అన్నలు నా అంగీ తీసుకున్నారు. దాన్ని మా నాయనకి చూపించి- అది దారిలో దొరికింది. ఏదో దుష్టమృగం నన్ను చంపేసి ఉంటుందని చెప్పి ఉంటారు. వెంటనే మా నాన్న చనిపోయి ఉంటారు. వియాన్! అదిగో అదే హెబ్రోను. అక్కడే మా తాత అబ్రాహాము, మా అవ్వ శారా సమాధి ఉంది. ఇప్పుడు మా తండ్రిని కూడా అక్కడే మక్పేలా గుహలో పాతిపెట్టి ఉంటారు" అంటూ కుప్ప కూలిపోయాడు.

వియాన్ ప్రక్కనే కూర్చున్నాడు. యోసేపు ఏడుస్తూనే ఉన్నాడు. ఇంతలో ఎవరో అటుగా వస్తుంటే యోసేపు, వియాన్ లేచి నిలబడ్డారు. తూర్పున కనబడుతున్న కొండ శిఖరం - దాన్నే హెబ్రోను కొండ అంటారు. అది నిజంగానే హెబ్రోనుకు ఏడెనిమిది మైళ్ళ దూరంలో ఉంది. వియాన్

యోసేపు భుజం మీద చేయివేసి చిన్నగా క్రిందకు నడిపించాడు. యోసేపును చూస్తూ "అక్కడకు వెళ్ళాలని ఉందా?" అని అడిగాడు. "లేదు, యజమానికి మాట ఇచ్చాను కదా! నీకు కూడా అనుమానం కలుగుతుందే..!? అన్నాడు యోసేపు. వియాన్ ఏమి మాట్లాడలేదు. ఇంకా ఇరవై నాలుగు గంటలు ఈ గాజాలో గడపాలి. గాజాలో ఉన్నంతకాలం యోసేపుకు మనసు నెమ్మది ఉండదని తెలుసు. డేరా దగ్గరకు రాగానే వస్త్రాలు మార్చుకుని యజమానికి కనబడ్డారు. భోజనం ముగించుకొని చాలాదూరం నడిస్తే, సముద్రపు ఒడ్డు కనిపించింది. ఇక్కడి సముద్రం యొప్పేలో లాగా లేదు. ప్రశాంతంగా ఉంది. కెరటాలు చాలా చిన్నవి. ఒడ్డున కూర్చుని సముద్రం చూస్తున్నాడు. సముద్రం చూస్తుంటే మనసు ఇంటిమీద నుండి మరలింది. యొప్పే సముద్రం భయాన్ని కలుగజేస్తే, గాజా సముద్రం నెమ్మది కలిగిస్తుంది.

దేవుని సృష్టి – ఆయన జ్ఞానాన్ని తనకు బోధిస్తున్న ట్లుగా ఉంది. తన తాత ప్రక్కనే కూర్చున్నట్లుగా, ఆయన మాట్లాడుతున్నట్లు అనిపించింది. తనకు తెలియకుండానే ఏదో మాట్లాడుకుంటున్నట్లు, మనసులో కలుగుతున్న భావాలు పెదవిదాటి చిన్నగా బయటకు వస్తున్నాయి. సముద్రంలో చేపల వేట ముగించుకొని బెస్తవారు తమ ఇళ్ళకు వెళ్తున్నారు. వియాన్ ఆ పల్లె ప్రజలను గమనిస్తుంటే, యోసేపు అన్నాడు – "సాయంత్రందాకా పాటుపడి తమ పనులను చేసుకోవటానికి మనుష్యులు బయటకు వెళతారు" అని. ఎడమప్రక్కగా చూస్తూ "యెహోవా నాటిన వృక్షాలపైన కొంగలు నివాసము చేస్తున్నాయి. గొప్ప కొండలు కొండ మేకలకు ఉనికిపట్లు, కుందేళ్ళకు బండలు ఆశ్రయస్థానం" అని వియాన్ వైపు చూస్తూ "వియాన్!" అని నవ్వాడు.

యోసేపు నవ్వితే గలగలమని నీళ్ళు పారినట్లు అనిపించింది వియాన్‌కి. యోసేపు ఎంత చక్కనివాడు! అనుకున్నాడు వియాన్. నిజంగా ఆ తండ్రి ఇతని వియోగ మునకు ఎంత తల్లడిల్లి పోతున్నాడో అనుకున్నాడు. యోసేపు మళ్ళీ నవ్వాడు. "ఈ బలహీనమైన కుందేళ్ళు – చిన్నప్పుడు షెకెము పొలములో వందలకొలది మందలుగా పొలాల్లో రాత్రివేళ పండుకొనేవి. ఒకసారి శబ్దమైతే ఆ శబ్దానికే రెండు కుందేళ్ళు చచ్చిపోయేవి. అటువంటి బలహీనమైన జీవికి దేవుడు బలమైన బండలు ఆశ్రయస్థానం చేశాడు. ప్రతి జీవి తమ ఆహారమును దేవుని నుండి తీసుకొన చూస్తున్నాయి" అన్నాడు. "అయితే మనకు ఆహారం ఇస్తుంది మన యజమాని యూషును కదా!" అన్నాడు వియాన్ నవ్వుతూ. "కాదు, ఆయన ఆహారం సృష్టించలేదు. దేవుని సృష్టిలో నుండి తనకు ఇవ్వబడింది తీసుకొని, తనకు ఆ సంగతి తెలియకపోయినా దేవుని ఆజ్ఞానుసారంగా మనకు, ఒంటెలకు ఆహారం పెడుతున్నాడు. అసలు దేవుని సెలవు లేనిదే ఏ జీవి కూడా ఆహారం తీసుకోలేదు" అన్నాడు యోసేపు. వియాన్‌కు ఏదో క్రొత్త విషయం వింటున్నట్లుగా ఆశ్చర్యపోయి 'నిజమా!' అన్నట్లు చూశాడు. ఔనన్నట్లు తలూపాడు యోసేపు.

"అదిగో విశాలమైన మహాసముద్రం, అందులో లెక్కలేనన్ని జలచరాలు చిన్నవి, పెద్దవి ఉన్నాయి. సముద్రంలో ఆడుకోవటానికి కొండలంత పెద్ద చేపలు న్నాయి. వాటికి కూడా దేవుడు తగిన కాలమందు" అని కొంచెంసేపు ఆలోచించి, తలవంచుకొని ఏదో ధ్యానిస్తున్న వానిలా... "ఇవన్ని నీ దయకొరకు కనిపెట్టుచున్నవి ప్రభువా! నీవు వాటికి పెట్టునది అవి కూర్చుకొనును" అని తనలో తాను మాట్లాడుకొనినట్లు, కాదు.. ధ్యానించినట్లుగా అంటూ వియాన్ వైపు చూసి "మన యజమాని (యూషును) మనకు పెట్టినట్లు" అని నవ్వాడు. వియాన్‌కి యోసేపు ముఖం చూస్తే ఆశ్చర్యం వేసింది. ఇంతకుముందు ఆ గుండ్రని గాలి కొండని చూసి అక్కడ అంతగా ఏడ్చిన వాడేనా ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నది? ఒక యోగిలాగా, ఋషిలాగా కనిపించాడు యోసేపు వియాన్‌కి.

"దేవుడు తన గుప్పిలి విప్పగా అవి మంచి వాటిని తిని తృప్తిపరచబడును. ఆయన ముఖము మరుగు చేసుకొనగా అవి కలతపడును. ఆయన వాటి ఊపిరి తీసివేయునప్పుడు అవి ప్రాణాలు విడిచి నీళ్ళలో మంటి

పాలవుతాయి. దేవుడు ఊపిరి విడిస్తే అవి మళ్ళీ సృష్టింప బడతాయి” అన్నాడు యోసేపు. వియాన్ యోసేపు భుజం మీద చెయ్యి వేశాడు. ఒళ్ళు వేడిగా ఉంది. జ్వరం ఏమి లేదు. అతని మెదడులోని ఆలోచనే శరీర వేడికి కారణం అని తెలుసు. యోసేపు ముఖం ఎంతో ఉల్లాసంగా ఉంది. ఏదో చెప్పలేని భావన. దానికి సరైన భాష అందనట్లుగా ఉన్నాడు. కళ్ళనిండా నీళ్ళు ఉన్నాయి. కాని అది ఏడుపు కాదు. “వియాన్! కొద్ది రోజులు నేను పాపంలో ఉన్నాను” అన్నాడు యోసేపు. వియాన్ మాట్లాడలేదు. “మీరు కాని దోతాను ద్వారా ప్రయాణం చెయ్యకపోయుంటే ఈనాటికి నేను ఉండేవాడిని కాదు. చనిపోయి ఉండేవాడిని. అయితే దేవుడు నా మరణం తప్పించటానికి యూషునుని పంపించాడు. నిజానికి ఆయన నన్ను కొనకపోతే వారు నన్ను నీళ్ళులేని గుంటలో వదలి వెళ్ళిపోయేవారు. ఆ గుంట అక్కడి వారికి ఎవరికి తెలియదు. దానిలో నీళ్ళులేవు. ఒక్కసారిగా చనిపోతే బాధలేదు. కానీ దప్పికకు, ఆకలికి అల్లాడి చనిపోయేవాడిని. ఒకవేళ అరచినా, ఎవరైనా విన్నా, ఆ గుంటలో నుండి ఆ స్వరము వచ్చిందనుకోరు. నా గర్వానికి, నా అహంకారానికి నేను నా అన్నల వలన శిక్షింప బడితే దేవుడు తనే అడ్డుకొని మిమ్ములను ఆ మార్గాన రప్పింపజేసి బ్రతికించాడు. నేనైతే నా దేవుని మీద మనసులో ఎన్ని నిందలు వేశానో! ఎన్నో అవిశ్వాసమైన ఆలోచనలతో ఉన్నాను. ఈ సముద్రాన్ని, ఈ వాతావరణాన్ని, నీ స్నేహాన్ని చూసి దేవుని కార్యాలను నేను గ్రహించేటట్లు నా కొరకు నన్ను ఇక్కడికి పంపించాడని నేను నమ్ముతున్నాను” అని తలవంచుకొని “దేవా! నీ కార్యములు ఎన్నో విధాలుగా ఉన్నాయి. జ్ఞానము చేత నీవు వాటిని చేస్తున్నావు” అని ఇంకేమి మాట్లాడకుండా మౌనంగా మోకాళ్ళ మీద తల ఆనించుకొని నిశ్చలంగా కూర్చున్నాడు.

వియాన్ లేచి దూరంగా వెళ్ళి వెనక్కి తిరిగి యోసేపు వైపు చూచి – ఎవరు ఈ యోసేపు? మొదటిసారి గాయాల తో గుంట నుండి తీయబడి, కేవలం ఇరవై వెండి రూకలకు అమ్మబడినవాడు. యొప్పే వచ్చేవరకు ఒక విధంగా ఉన్నాడు. యొప్పేలో కొంచెం మార్పు కనిపించింది. కానీ గాజా పట్టణం వచ్చిన దగ్గర్నుండి యోసేపు ఎవరో క్రొత్తవాడిలాగా ఇంతకుముందు తను ఎరుగనివానిలా వయస్సుకు మించిన వానిలాగా కనిపిస్తున్నాడు. యోసేపు శబ్దం రాకుండా గాలిలో నడిచినట్లుగా దగ్గరికి వచ్చి “వెళ్దామా?” అన్నాడు. “నిన్ను ఒక విషయం అడగాలి!” అడిగాడు వియాన్. “ఆలస్యమైతే యజమాని కోపగించడా?” అన్నాడు యోసేపు. “అయితే పద, చాలాదూరం నడవాలి” అన్నాడు వియాన్. ఇద్దరూ పట్టణంలో గుండా ప్రయాణం చెయ్యాలని అనుకున్నారు. గాజా పట్టణం చుట్టూ గోడ కట్టబడి ఉంది. పట్టణం చక్కగా నిలువుగా, అడ్డంగా గీతలు గీసినట్లు రహదారులు, దుకాణాలు ఎంతో ముచ్చట వేసింది. ఒక బజారు అన్ని వీధుల కంటే అందంగా ఉంది. కాని అటు వెళ్ళడానికి వియాన్ ఒప్పుకోలేదు. ‘ఎందుకు?’ అని నిలవేసినట్లుగా ఆగాడు. **(సశేషం)**


**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra




# 'వేర్ ఈజ్ యువర్ హార్ట్'



'హృదయం ఎక్కడున్నది నీ చుట్టూనే తిరుగుతున్నది' అన్నది సినిమా పాటే కావచ్చు కానీ, ప్రతి ఒక్కరి హృదయం ఎక్కడో తిరుగుతూనే ఉంటుంది. హృదయం ఎప్పుడూ ఒక్క క్షణం తీరిగ్గా కూర్చోదు. ఏదో తపన, ఏదో ఒకటి చేసెయ్యాలి. కోతికి కొబ్బరికాయ దొరికినట్లు హృదయానికి 'స్మార్ట్‌ఫోన్' రూపంలో చేతినిండా పని దొరికింది. ఇంక హృదయానికి పంట పడింది. దాని చుట్టూ తిరిగే పని లేకుండా హృదయాన్ని స్మార్ట్‌ఫోన్‌లో పెట్టేసి సెక్యూరిటీ పాస్‌వర్డ్‌తో లాక్‌చేసి పారేశారు. ఇంక హృదయం స్మార్ట్‌ఫోన్‌లో నుండి బయటికి రావాల్సిన అవసరమే లేకుండా స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో కావలిసినంత ఎంటర్‌టైన్‌మెంట్. అప్పుడెప్పుడో యేసుప్రభువు 'నీ ధనమెక్కడ నుండునో అక్కడనే నీ హృదయము ఉండును' అని చెప్పాడు. ఇప్పుడైతే 'నీ స్మార్ట్‌ఫోన్ ఎక్కడ ఉండునో అక్కడే నీ హృదయం ఉంటుంది' అని చెప్పాల్సి వచ్చేంతగా ప్రతిఒక్కరూ స్మార్ట్‌ఫోన్‌కి బానిసలయ్యారు. *'నరుల హృదయా లోచన వారి బాల్యము నుండి చెడ్డది' (ఆది. 8:21).* ఇలాంటి చెడ్డ హృదయాన్ని ఈ స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సోషల్ మీడియా ఇంకా చెడగొట్టి దేవునికి దూరం చేస్తుంది. యేసుక్రీస్తు రెండవ రాకడ నేడో రేపో అన్నంత దగ్గరగా ఉంది అనటానికి నిదర్శనంగానే దేవుని సువార్త స్పీడుగా వ్యాప్తి చెందటానికి దేవుడు స్మార్ట్‌ఫోన్‌ని సృష్టించాడు. స్మార్ట్‌ఫోన్‌లో బైబిలు ఉంటది కదా నా బిడ్డలు రోజూ బైబిలు చదువుతారులే, యూట్యూబ్‌లో రోజూ దేవుని వాక్యము వింటారులే, వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా నా వాక్యాన్ని 24 గంటలూ షేర్ చేస్తారు అని భావించాడు. దేవుడు సృష్టించిన దానిని చెడగొట్టటమే సాతాను లక్ష్యం కాబట్టి ఆ స్మార్ట్‌ఫోన్ ద్వారానే మనుష్యులను నాశనం చేయడానికి ప్లాన్ చేసి, స్మార్ట్‌ఫోన్ నిండా చెత్తాచెదారం పోసింది. మనుష్యులు దేవున్నే బురిడీ కొట్టించే అతితెలివితో దేవుని వాక్యం ఏవో రెండు పోస్టులు పెట్టి, ఇంక రోజంతా సాతాను పని మీదనే ఉంటారు. పాపం సాతాను మనకోసం ఎంతో కష్టపడి చేసిన యాప్‌లు వాడకపోతే సాతాను బాధపడిద్దని, జాలిగల హృదయంతో సాతానును ఎక్కువ బాధపెట్టకుండా యాప్‌లు మొత్తం ఇన్‌స్టాల్ చేసుకొని ఆ చెత్తలో పడి పొర్లాడటమే గొప్ప భాగ్యమన్నట్లు నిద్ర కూడా పోకుండా మరీ వాడుతున్నారు. చదువువున్నా లేకపోయినా, పేద గొప్ప, ఆడ మగ, చిన్న పెద్ద, అన్యజనులు క్రైస్తవులు అన్న తేడా లేకుండా ఈ సోషల్ మీడియా మత్తులో మునిగిపోయారు. చివరికి దేవుని పని చేస్తున్నామని చెప్పుకునే సంఘకాపరులు, సువార్తికులు కూడా సాతాను ట్రాప్‌లో పడ్డవారిని రక్షించా ల్సింది పోయి, వారే సాతాను ట్రాప్‌లో చిక్కి యూట్యూబ్‌లో దేవుని వాక్యము పెట్టడం ద్వారా డబ్బు సంపాదనలో బిజీగా ఉన్నారు. గతంలో 'రండి, వినండి, రక్షణపొందండి' అనే నినాదంతో వాక్యం ప్రకటించేవారు. ఇప్పుడైతే 'లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయండి' అని బతిమాలు కుంటున్నారు. ఈ సోషల్ మీడియా అనేది మనుష్యులందరికీ ఒక మాయా విగ్రహమై పోయింది. నిద్ర లేచిన దగ్గర్నుండి మళ్ళీ పడుకొనే వరకు దాని పూజలోనే అందరూ తరిస్తున్నారు. *'మీ హృదయము మాయలలో చిక్కి త్రోవ విడిచి యితర దేవతలను పూజించి వాటికి నమస్కరింపకుండ మీరు జాగ్రత్త పడుడి' (ద్వితీయో. 11:16)* అని దేవుడు హెచ్చరించిన విషయం ఎవరికీ వినబడ లేదు, కనబడలేదు. ఎందుకంటే అందరూ ఈ సోషల్ మీడియా మాయలో చిక్కి త్రోవ విడిచి స్మార్ట్‌ఫోన్‌కి, ఇంటర్నెట్‌కి బానిసలైపోయారు. మరి మీ పరిస్థితి ఏంటి? మీ హృదయం ఎక్కడుంది? **'ప్లీజ్ చెక్... వేర్ యువర్ హార్ట్ ఈజ్...'**

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు

**9440217726**

సీరియల్

5

# నా చిత్తానుసారుడు

**– కొడవటికంటి**

**(దావీదు జీవిత చరిత్ర)**

పదిమైళ్ళు ప్రయాణం తర్వాత ఏలా లోయకు వచ్చినప్పుడు అబ్నేరు రాజువద్దకు వచ్చాడు. సౌలు తన వాహనం దిగినప్పుడు–

"యుద్ధం జరుగదు రాజా" అన్నాడు అబ్నేరు.

"ఎలా?" అన్నాడు సౌలు

"గొల్యాతు అనే నెఫీలీయుడు ఒకడు ఫిలిష్తీయుల సైన్యమునకు ముందుగా వచ్చి ఇశ్రాయేలీ యులలో ఎవరైనా నాతో పోట్లాడి నన్ను చంపగలిగిన యెడల మేము మీకు దాసులమగుదుము. నేనతని చంపిన యెడల మీరు మాకు దాసులై మాకు దాస్యము చేయుదురు. ఈ దినమున నేను ఇశ్రాయేలీయుల సైన్యములను తిరస్కరించుచున్నాను. ఒకని నియమించిన యెడల వాడును నేనును పోట్లాడుదుమని ఆ ఫిలిష్తీయుడు చెప్పుచున్నాడు" అన్నాడు అబ్నేరు. "అయితే మన సైన్యములో చాలామంది శూరులు ఉన్నారు కదా!" అన్నాడు సౌలు. "నిజమే కాని ఆ గొల్యాతు దాదాపు పది అడుగుల ఎత్తు వాడు. అతడు నెఫీలుడు" అన్నాడు అబ్నేరు. "అయితే ఇప్పుడు ఏమిటి కర్తవ్యం" అన్నాడు సౌలు. "వాడు నిన్న ఉదయం సాయంకాలం ఇదే విధంగా సవాలు చేసి యున్నాడు. ఈ రోజు ఉదయం కూడా. దేవుడు ఈ యుద్ధమును ఏ విధంగా మొదలుపెట్టి ముగించనున్నాడో ఎంత కాలమైనా వేచి చూడవలసిందే. మీరు రాజప్రసాద మునకు వెళ్ళండి. ప్రతి దినము మీకు ఇక్కడి పరిణామ ములను తెలియజేస్తుంటాను" అన్నాడు అబ్నేరు. సౌలుయొద్ద ఉండి, సెలవు పొంది దావీదు బేత్లెహేమునకు తిరిగి వచ్చాడు. అయితే ఈసారి బేత్లెహేము ప్రయాణంలో బహు ఖిన్నుడై వచ్చాడు. ఎవరు ఈ గొల్యాతు? ఇశ్రాయేలీయులలో జీవముగల దేవుని సైన్యంలో ఒక్క వ్యక్తి కూడా వానితో పోరాడ శక్తి లేనివారా? ఇది ఎంత అవమానం? తన హృదయం దుఃఖంతోను, పౌరుషంతోను ఉడికిపోతున్నది. తాను స్వతంత్రుడు కాదు – యుద్ధంలోని సైనికుడు కాదు. తాను కేవలం సౌలురాజు ఆయుధాలు మోయువాడు మాత్రమే.

నెల రోజులు గడచిపోయాయి. ఇశ్రాయేలు సైన్యం ఈ కొండ మీద ఫిలిష్తీయులు ఆ కొండమీద డేరాలు వేసుకొని ఒకరినొకరు చూసుకోవటమే. ప్రతిరోజు ఉదయం సాయంత్రం గొల్యాతు బయలుదేరి తనను తాను అగపరచు కొంటున్నాడు. సౌలు ఇన్ని రోజులు బహు మనోవ్యాకులత కలిగి వున్నాడు. రాజైన తర్వాత తన దృష్టంతా రాజ్యం మీదనే కాని దేవుని మీద లగ్నపరచలేదు. అబ్నేరుతో మాట్లాడటం తప్పితే ఇంక ఏ సంగతి అతని ఆలోచనలలో లేదు. ఇప్పటికి సరిగ్గా నలభైరోజుల నుండి తన సైన్యం ఏలా లోయలో ఉంది. వారికి ఆహారం సమకూర్చటం పెద్ద సమస్య అయిపోయింది. సమూయేలుగారి దగ్గరకు ఎన్నిసార్లు కబురు చేసినా రాలేదు. తాను స్వయంగా వెళితే ఆయనకి కోపం వస్తుందేమోనని భయం. నోబులో అహీమెలెకునకు కబురు చేస్తే వచ్చాడు. దేవుడైన యెహోవా ఏదో గొప్ప కార్యం జరిగించి ఫిలిష్తీయులను నాశనం చేస్తాడు అని చెప్పాడు కాని ఎలా? అనేది అర్థం కాలేదు.

ఉదయాన్నే తన తండ్రి కబురు చేస్తే దావీదు వెళ్ళాడు. "నీ సహోదరుల కొరకు వేయించిన గోధుమలు ఒక తూమెడును ఈ పది రొట్టెలును తీసుకొని దండు లోనున్న నీ సహోదరుల వద్దకు త్వరగా పొమ్ము. మరియు ఈ పది జున్నుగడ్డలను తీసుకొని పోయి వారి సహస్రాధిపతి కి ఇచ్చి, నీ సహోదరులు క్షేమంగానున్నారో లేదో తెలుసు కొని వారి యొద్ద నుండి ఆనవాలొకటి తీసికొని రమ్ము" అన్నాడు. ఎన్నోరోజుల నుండి తాను ఏలా లోయకు వెళ్ళి

ఆ ఫిలిష్తీయుని చూడాలనుకుంటున్న తన కోరిక ఇంత త్వరగా నెరవేరి నందుకు సంతోషిస్తూ గాడిద మీద ఆ వస్తువులు బిగించి తన గాడిద మీద ప్రయాణమయ్యాడు. దారిలో అబీషైకి సంగతి చెప్పి ఏలా లోయకు వచ్చేటప్పటికి మధ్యాహ్నమైంది. సహస్రాధిపతి తనకు తెలిసినవాడే. ఆయనతో మాట్లాడినప్పుడు ఆయన చాలా విచారంగా కనిపించాడు. “జీవముగల దేవుని సైన్యములను తిరస్కరించుటకు ఈ సున్నతి లేని ఫిలిష్తీయుడు ఎంతటివాడు. వాని చంపి ఇశ్రాయేలీయుల మీద నుండి ఈ నిందను తొలగించిన వానికి బహుమతి ఏమి?” అని అడిగాడు. “వానిని చంపిన వానికి రాజు బహుగా ఐశ్వర్యము కలుగజేసి, తన కుమార్తెనిచ్చి వివాహం చేసి, వాని తండ్రి ఇంటి వారిని ఇశ్రాయేలీయులలో స్వతంత్రులుగా చేయును” అని అన్నాడు. అటు తిరిగి చూస్తే సైన్యంలో బేత్లెహేమీయుడైన షెలహు ఎదురు వచ్చాడు. దావీదును చూసి పలకరించి “ఈ గొల్యాతు చేసే సవాలు విన్నావా?” అన్నాడు. సహస్రాధిపతితో పలికిన పలుకులే అతనితో అన్నాడు. అతను ఆశ్చర్యపోతూ “అయితే గొల్యాతుతో తలపడగలవా?” అన్నాడు. “రాజుగారు ఒప్పుకోవద్దా?” అంటుండగా, తన అన్న ఏలియాబు కనిపించాడు. దావీదును చూస్తూ “అసలు నువ్వు ఇక్కడికి ఎందుకొచ్చావు? గొఱ్ఱెలను అరణ్యంలో ఎవరి దగ్గర వదలి వచ్చావు? నాకు తెలుసు నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావో. చేయుమని చెప్పినది చేయుటకు నీకు ఇష్టము లేదు. యుద్ధము చూచుటకే కదా ఇక్కడకు వచ్చింది” అన్నాడు.“నేనేమి చేశాను. నేనేమి తప్పు చేయలేదే” అన్నాడు దావీదు”.

షెలహు సైన్యంలో గూఢచారిగా పనిచేస్తున్న సంగతి దావీదుకు మాత్రమే తెలుసు. షెలహు గుఱ్ఱం మీద ఎక్కి యెబూసు వైపు వెళ్ళటం చూసాడు. ఈ సంగతి రాజుతో చెప్తాడని తెలుసు. సహస్రాధిపతి దావీదును పిలిచి “ఈ రాత్రి మీరు రాజుగారి దగ్గరకి వెళ్తారా?” అని అడిగాడు. “లేదు, ఇక్కడే ఉంటాను” అన్నాడు. “అయితే నా డేరా ప్రక్కనే ఉన్న డేరాని వాడుకోండి” అన్నాడు మర్యాదగా. ఆ సాయంకాలం షెలహు వచ్చి సహస్రాధిపతితో మాట్లాడి రాజు దావీదును పిలిచారని చెప్పాడు. వెంటనే సహస్రాధిపతితో కలిసి దావీదు ప్రయాణమయ్యాడు. రాత్రి ఎనిమిది గంటలకు సౌలు దర్శనమైంది. ఆయన ఆలోచిస్తున్నాడు. దావీదును చాలాసేపు పరీక్షగా అదే మొదటిసారి చూస్తున్న వానివలె చూస్తున్నాడు. ఆయన ఏమి మాట్లాడలేదు. అబ్నేరు ఆయన ప్రక్కనే నిలబడి ఉన్నాడు. సహస్రాధిపతి దూరంగా నిలబడి ఉన్నాడు.

“ఈ ఫిలిష్తీయునిబట్టి ఎవరి మనస్సు కృంగ నిమిత్తము లేదు. మీ దాసుడనైన నేను వానితో పోట్లాడుదును”అన్నాడు దావీదు దృఢముగా. అబ్నేరు సౌలువైపు చూచాడు. “ఈ ఫిలిష్తీయుని ఎదుర్కొని వానితో పోట్లాడుటకు నీకు బలం చాలదు. నీవు బాలుడవు వాడు బాల్యం నుండి యుద్ధాభ్యాసం చేసినవాడు” అన్నాడు సౌలు. “మీ దాసుడనైన నేను నా తండ్రి యొక్క గొఱ్ఱెలను కాయుచున్నప్పుడు సింహమును ఎలుగుబంటియు వచ్చి మందలో నుండి ఒక గొఱ్ఱెపిల్లను ఎత్తికొని పోవుచుండగ నేను దానిని తరిమి చంపి దాని నోట నుండి ఆ గొఱ్ఱె పిల్లను విడిపించితిని. అది నా మీదకు రాగా దాని గడ్డము పట్టుకొని దానిని కొట్టి చంపితిని మీ దాసుడనైన నేను ఆ సింహమును ఎలుగుబంటిని చంపితినే” అని ఈసారి తాను రాజసముఖమున ఉన్నట్లుగా కాక గొల్యాతును ఎదుర్కొంటున్న వానివలె స్వరము కఠినముగాను పెద్దదిగాను “జీవముగల దేవుని సైన్యములను తిరస్కరించిన ఈ సున్నతిలేని ఫిలిష్తీయుడు వాటిలో ఒకదానివలె అగుననియు'' మరల మెత్తని స్వరముతో “సింహము యొక్క బలము నుండి, ఎలుగు బంటి యొక్క బలము నుండియు నన్ను రక్షించిన యెహోవా ఈ ఫిలిష్తీయుని చేతిలో నుండి కూడా నన్ను విడిపించును” అని వంగి నమస్కరించాడు.

సౌలు లేచి నిలబడి అబ్నేరు వైపు చూచి, ధరహాసముతో “పొమ్ము యెహోవా నీకు తోడుగా నుండును గాక” అన్నాడు. ఆ రాత్రి రాజప్రసాదంలోని తన గదిలో పండుకొన్నాడు.

**(సశేషం)**

# రక్తస్రావ రోగము గల స్త్రీ

దేవుని మహాపరిశుద్ధ నామంలో పాఠకులందరికి వందనములు. బైబిల్లోని మార్గదర్శకులైన స్త్రీలలో యేసుచే స్వస్థతనొందిన రక్తస్రావరోగము గల స్త్రీని గురించి ఈ సంచికలో ధ్యానిద్దాం.

స్త్రీలకు సహజంగా కలిగే రక్తస్రావమును యూదులు అపవిత్రంగా భావిస్తారు. ఆచారవ్యవహారాలలో యూదులు నిష్ఠాగరిష్ఠులు. లేవీయ.15:19-30 వరకు చదివితే రక్తస్రావము గల స్త్రీ అపవిత్రురాలని, ఆ దినములన్నియు ఆమె కడగా ఉండాలని, ఆమె కడగా ఉన్న సమయంలో ఆమె వాడిన వస్తువులను తాకిన వారు సాయంత్రము వరకు అపవిత్రులని ఆజ్ఞ ఇవ్వబడింది. రక్తస్రావము ఆగిన తరువాత ఏడు రోజుల వరకు కడగా ఉండి ఆ తరువాత ఆమె శుద్ధి నిమిత్తం రెండు తెల్లగువ్వలనైనను రెండు పావరపు పిల్లలనైను దేవాలయ మునకు తీసుకెళ్ళి ఒకదానిని పాపపరిహారార్థ బలిగాను ఒకదానిని దహన బలిగాను అర్పించాలి. ఆ తరువాతనే ఆమె పవిత్రురాలుగా తీర్చబడి అందరివలె సామాన్యమైన జీవితాన్ని జీవించ గలుగుతుంది. ఇది యూదా సాంప్రదాయ నేపథ్యము

మత్తయి.9:20-22, మార్కు.5:25-34, లూకా8: 43-48లలో రక్తస్రావరోగము కలిగిన స్త్రీ గురించి వ్రాయబడింది.

ఈ స్త్రీ పంద్రెండు సంవత్సరాలుగా రక్తస్రావ రోగముతో బాధపడుచున్నది అంటే ఆమె పంద్రెండు సంవత్సరాలుగా ఒంటరిగా బ్రతుకుతున్నదనమాట. ఆమె యూదా సమాజంలో అంటరానిదాని వలె జీవించి ఉండవచ్చు. ఇంట్లోను చిన్నవారి నుండి పెద్దవారి వరకు అందరూ ఆమెను వేరుగా చూడటం ఆమెను ఎంతో బాధించి ఉండవచ్చు. ఎటువంటి సరదాలు, సంతోషాలు లేకుండ ఒంటరిగా బ్రతకడం వలన ఎంతో మానసిక వేదనతో ఆ పంద్రెండు సంవత్స రములు జీవించి ఉంటుంది.

ఆమె వివాహ జీవితం గురించి బైబిల్లో వ్రాయబడలేదు. యేసు దగ్గరకు వచ్చు సమయానికి ఒకవేళ ఆమెకు వివాహం కాకపోయి ఉంటే ఆమెకు చిన్న వయస్సులోనే ఆ రోగము వచ్చి ఉంటుంది అంటే ఆమెకు ఇక భవిష్యత్తే లేనట్లు. ముట్టుకోవడమే నేరమైతే ఇక వివాహమనేది కల్ల. ఆ కాలం నాటి పరిస్థితులను బట్టి చూస్తే భవిష్యత్తు పూర్తిగా శూన్యం. ఒక వేళఆమెకు వివాహం అయ్యాక ఆ రోగం వస్తే ఆమె వైవాహిక జీవితం ఖచ్చితంగా విఫలమై ఉంటుంది ఎందు కంటే ఆమె 12సం॥లుగా బాధపడుతుంది మొత్తానికి ఏ విధంగా చూసినా ఆమె జీవితం చీకటిమయమే.

పూర్తిగా నిరాశతో ఉన్న ఆమె జీవితం ఇక అంతే అని వదిలేయక తన సమస్యకు, తన జీవితానికి ఒక పరిష్కారం ఉంటుంది అనుకుంది. దానిని వెతకడం ప్రారంభించింది. దానిలో భాగంగానే వైద్యుల వద్దకు వెళ్ళింది. వాస్తవానికి వైద్యులు వద్దకు వెళ్ళడం కూడా ఒక సాహసమే అని చెప్పాలి. ఎందుకంటే మార్గంలో ఎవరైనా యూదులు ఈమెను అపవిత్రురాలు అని గుర్తిస్తే ఛీత్కారానికి గురికావలసి ఉంటుందని తెలిసినను ఆమె వైద్యులను సంప్రదించింది. ఏదో ఒకసారి కాదు, అనేకమార్లు సాహ సించి వైద్యులను సంప్రదించి తన వద్దనున్న డబ్బు అంతా ఖర్చుపెట్టింది. ఎన్నోతిప్పలు పడినను ఆమె వ్యాధి నయం కాలేదు.

కాళ్ళు చేతులు సవ్యంగా ఉండి ఒంటరిగా బ్రతకడం చాలా కష్టతరమైనది. దేవుని నమ్మి, ఆయనను గురించి ఆలోచించేవారో లేదా ఆయనను గూర్చిన అన్వేషణలో ఉన్నవారు మాత్రమే ఒంటరిగా జీవించగలరు. అలా చేయలేనివారు తమ బ్రతుకులకు అర్థాన్ని తెలుసుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటారు. రక్తస్రావరోగము కలిగిన స్త్రీ యూదురాలు కాబట్టి దేవుని గురించి వినిన అనేక విషయాలను తలపోసుకుంటూ తన జీవితం యొక్క పరమార్థం ఏమిటి? ఎందుకు దేవుడు తనకు ఇలాంటి

జీవితాన్ని ఇచ్చాడు? అందరూ ఆనందంగా ఉంటే తను మాత్రమే ఇలా ఒంటరిగా బ్రతకాల్సిన స్థితి ఎందుకు పెట్టాడు వంటి అనేక ప్రశ్నలతో మనసులో దేవుని వెదుకుతూ ఉండి ఉంటుంది.

*"తన్ను ఆశ్రయించు వారి యెడల యెహోవా దయాళుడు తన్ను వెదకు వారి యెడల ఆయన దయచూపు వాడు" విలాప 3:25*

పూర్తిగా ఆమె జీవితంలో ఎటువంటి ఆశ లేని సమయంలో యేసు గురించి విన్నది. విన్నదానిని బట్టి యేసు పై విశ్వాసం ఉంచింది. *"వినుట వలన విశ్వాసము కలుగును వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును"* రోమా *10:17.* విన్నదే తడువుగా ఆయనను కలుసుకొనుటకు ప్రయత్నించి ఉండవచ్చు. అయితే యేసు సువార్త నిమిత్తం అనేక గ్రామాలు తిరుగుతున్న సమయంలో ఆమె యేసు కోసం ఎక్కడెక్కడ తిరిగిందో, ఎంతకాలం ఎదురు చూసిందో. పైగా ఆ వ్యాధితోనే గ్రామాలు దాటి రావాలి. రవాణా సౌకర్యం సరిగా లేని ఆ కాలంలో ఆమె ఎంతో కష్టపడి గ్రామాలు దాటి యేసుని చేరి ఉంటుంది. ఆ మార్గంలో ఎన్ని కష్టాలు పడిందో, ఆమె వ్యాధి గురించి తెలిస్తే ఛీత్కారాలకు గురికావలసి ఉంటుందని భయంతో ప్రయాణించి ఉంటుంది. కొన్ని సార్లు ఛీత్కారలకు గురై ఉండవచ్చు కూడా. ఎందుకంటే ఆమె ప్రయాణం కొన్ని గంటలదైతే ఖచ్చితంగా కాదు. ఆమె ఆ ఊరి స్త్రీ అయి ఉండదు. ఎందుకంటే ఆ ఊరి వారికి ఆమె అపవిత్రురాలని తెలిసి ఉంటుంది కాబట్టి ఆమె అందరి ఎదుటకు వచ్చి ఉండేది కాదు. వచ్చినా ఆమె జనసమూహములోకి వచ్చుటకు సాహసించేది కాదు. సాహసించినా ఆమె ప్రయత్నాన్ని యూదులు సాగనిచ్చేవారు కాదు.

యేసు గురించి వినిన ఈమె యేసు తనను స్వస్థపరచ గలడు అని కొంత విశ్వాసాన్ని కలిగి ఉన్నప్పటికి యేసు కూడా యూదుడే కాబట్టి ఆయన తనను ముట్టడు. ఆయన దృష్టికి తాను అపవిత్రురాలు. కాబట్టి ఆయన తనను తాకి స్వస్థపరచుటకు అంగీకరించడేమో అనుకున్నదో లేక జన సమూహం క్రిక్కిరిసి ఉండటం వలననో యేసును కాకున్న కనీసం ఆయన వస్త్రాన్ని తాకితే స్వస్థత పొందగలను అనుకున్నది. యేసు తనను తాకకున్నను ఆయనను తాకిన ఆయన పైవస్త్రమును తాకిన స్వస్థత పొందవచ్చు అని గట్టిగా విశ్వసించింది. ఆ దృఢ విశ్వాసంతో యేసు పైవస్త్రపు చెంగును తాకింది స్వస్థత పొందింది.

తన రోగం తగ్గినదో లేదో ఖచ్చితంగా తెలుకునే లోపే తనను తాకినది ఎవరని యేసు అడిగినప్పుడు భయంతో వణకుచు ముందుకు వచ్చి సాగిలపడి తన పరిస్థితి, తను ఎందుకు ఆయనను ముట్టినది, తాను ఎలా స్వస్థత పొందినది చెప్పింది. అందుకు యేసు కుమారీ నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను సమాధానము గలదానవై పొమ్ము అనెను. యేసు ఆమెను అడగక మునుపే ఆమె స్వస్థత పొందింది. అయితే యేసుని ప్రేమను ఆమె రుచి చూడలేదు. ఆమె భయము వణుకు మనసులో కొట్టుమిట్టాడుతున్న అనేక ప్రశ్నలకు సమాధానంగా యేసుని ప్రేమను పొందుకున్నది.ఆమెను అపవిత్రురాలిగా యేసు చూడలేదు. ఇంకా ఆమె తాకిన కారణాన యేసును అపవిత్రుడని, యూదా మత ఆచారాన్ని మంటగలిపిన వ్యక్తి అని అక్కడి యూదుల నిందించి ఉండవచ్చు. తన కారణంగా ఆయన అందరిచే నానామాటలు అనిపించుకుంటూ తనపై చూపిన ప్రేమను ఆమె జీవితాంతం మరచి ఉండదు.

రక్తస్రావ రోగము గల స్త్రీ ఎన్నో ఇబ్బందులు కష్టాలు, ఛీత్కారాలు, నిరాశలు కలిగిన జీవితం నుండి ఆనందకరమైన జీవితాన్ని కేవలం పొందుకుంది. కేవలం స్వస్థతనే కాదు, యేసు ప్రేమను, మనస్సులో సమాధానాన్ని పొందుకుంది. దానికి కారణం అచంచలమైన ఆమె విశ్వాసం.

మరి క్రైస్తవ స్త్రీలమైన మన విశ్వాసం ఎలా ఉన్నదో మనం పరీక్షించుకొని విశ్వాస పరిమాణాన్ని పెంచుకుంటూ క్రైస్తవ జీవితాన్ని కొనసాగించే వారముగా ఉందాం.

*" మీ విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక, దేవుని శక్తిని ఆధారము చేసుకొని ఉండాలి" 1కొరింథీ 2:4*

# ఉపవాసము

క్రైస్తవ సమాజం అంతా ఉపవాసాలతో, ఉపవాస ప్రార్థనలతో బిజీగా ఉన్నది. ఉపవాసమునకు బైబిల్లో ఒక ప్రత్యేక స్థానమున్నది. పాతనిబంధన కాలంలోని భక్తులు కష్టకాలంలో ఉపవాసముండి దేవుని సహాయం పొందుకున్న సందర్భాలు కోకొల్లలు. కేవలం భక్తులే కాదు అన్యులు కూడా దేవుని కృపను పొందుకోడానికి ఉపవాసం మంచి మార్గం అని చెప్పవచ్చు. ఉదా: నీనెవె ప్రజలు ఉపవాసంతో దేవుని ఉగ్రతను తప్పించుకున్నారు. ఇశ్రాయేలు రాజైన అహాబు దుర్మార్గుడైనప్పటికి, విగ్రహారాధన చేసినప్పటికి ఏలీయాప్రవక్త మాటలు విని ఉపవాసముండి ప్రార్థించగా దేవుడు చేస్తానన్న కీడు అతని కాలంలో చేయక మానుకున్నాడు. హిజ్కియా ఉపవాస ప్రార్థనతో ఆయుష్షును పొందాడు. ఇటువంటి సంధర్భాల ఆధారంగా ఉపవాస ప్రార్థన అన్ని రకాల సమస్యలకు పరిష్కారంగా చెప్పవచ్చు.

పాతనిబంధన కాలంలో తమ వస్త్రాలు చింపుకొని గోనెపట్ట కట్టుకొని, బూడిదలో కూర్చుని అన్నపానాలు మానుకొని ప్రార్థన చేసేవారు. బట్టలు చింపుకోవడం, బూడిదలో కూర్చోవడం అనేది వారి దుఃఖాన్ని భౌతికంగా తెలపడానికి సాదృశ్యంగా ఉంది. అయితే కాలక్రమంలో ఉపవాసం ఒక వేషధారణగా, మనుష్యులకు కనబడుటకు చేయు ఒక ఆచారపరమైనక్రియలా మారిపోయింది. అందుకే యేసుప్రభువు ఉపవాసమున్నప్పుడు వేషధారులవలె దుఃఖముఖులై ఉండవద్దు. మనుష్యులకు కనబడవలెనని కాక రహస్యమందు చూచుచున్న నీ దేవునికి కనబడవలెనని ఉపవాసం ఉండాలి (మత్తయి 6:16-18) అని చెప్పాడు. మరి మన ఉపవాసం ఎలా ఉన్నది? ఆచారపరమైనదిగా, అలవాటు ప్రకారమైన ఉపవాసముగా ఉన్నదా? లేక నీ దేవునికి మాత్రమే కనబడే ఉపవాసముగా ఉన్నదా? ఆలోచించండి. ఒక అలాటుగా, వాడుకగా చేసే ఉపవాసం దేవుని దృష్టికి వెళ్తుందా? దేవునికి మన ఉపవాసం ఆమోదయోగ్యంగా ఉన్నదా? ఇవన్నీ ఆలోచించడం క్రైస్తవ సమాజానికి అత్యంత ఆవశ్యకం.

దేవుడు ఎటువంటి ఉపవాసాన్ని కోరుతున్నాడో, యెషయా 58వఅధ్యాయాన్ని నిశితంగా పరిశీలించుట ద్వారా తెలుసుకుందాం.

*తమ దేవుని న్యాయవిధిని విడువక నీతిని అనుసరించువారైనట్టు అనుదినము వారు నా యొద్ద విచారణ చేయుచు నా మార్గములను తెలిసికొన నిచ్ఛ కనబరచుదురు తమకు న్యాయమైన తీర్పులు తీర్చవలెనని వారడుగుదురు. దేవుడు తమకు ప్రత్యక్షుడు కావలెనని యిచ్ఛయింతురు మేము ఉపవాసముండగా నీవెందుకు చూడవు? మేము మా ప్రాణములను ఆయాసపరచుకొనగా నీవెందుకు లక్ష్యపెట్టవు అని అందురు.*

అంటే వీరు కూడ మనలాగే అనుదినము ప్రార్థన చేస్తారు, దేవున్ని తెలుసుకొనుటకు ఆయన మాటలు వినుటకు ప్రార్థనలకు వెళ్తారు, దేవుడు తమకు కనబడాలని కోరుకుంటారు, ఉపవాసముంటారు అయితే దేవుడు వారిని, వారి ఉపవాస ప్రార్థనను లక్ష్యపెట్టుటలేదు పైగా నీతిని అనుసరించువారైనట్టు అంటున్నాడు అంటే వారు నీతిని అనుసరించుట లేదు కానీ అనుసరిస్తున్నట్లు ఉంటుంది వారి ప్రవర్తన అంటే వేషధారణ (లేనిదానిని ఉన్నట్లు పైకి చూపడం). మన ప్రార్థనలు, ఉపవాసాలు ఎలా ఉన్నాయి? వేషధారణగా ఉన్నదా? నీ ఉపవాసం దేవుని దృష్టికి అనుకూలమైనదనే నిశ్చయత నీకున్నదా? లేకున్నచో దేవుడు నిన్ను నీ ఉపవాసాన్ని ఎందుకు అలక్ష్యము చేస్తున్నాడో ఆలోచించవా?

*మీ ఉపవాస దినమున మీరు మీ వ్యాపారము చేయుదురు మీ పనివారి చేత కఠినమైన పని చేయించుదురు మీరు కలహపడుచు వివాదము చేయుచు అన్యాయముగా గుద్దులాడుచు ఉపవాసముందురు మీ కంఠధ్వని పరమున*

*వినబడునట్లుగా మీరిప్పుడు ఉపవాసముండరు అట్టి ఉపవాసము నాకనుకూలమా?*

ఉపవాసం ఉండి మీరు మీ ఉద్యోగాలు, వ్యాపారాలు, మీ దైనందిన కార్యక్రమాల్లో మీ సమయాన్ని వెచ్చిస్తారు. మీ పనివారితో మీ ప్రవర్తన మారదు. ఇతరుల విషయంలో మీ కోపాలు, మత్సరము కొట్లాటల విషయాల్లో మీ ప్రవర్తన మారకుండా అన్యాయమైన ప్రవర్తన గలవారై కేవలం తిండి మానేసి నీవు చేసే ఉపవాసం నాకనుకూలం కాదని దేవుడు చెప్తున్నాడు. అంటే ప్రస్తుతం మనం చేస్తున్న ఉపవాసం, పాటిస్తున్న లెంట్‌డేస్ దేవునికి అనూకూలమైనది కాదు. మరి ఎవరికి అనుకూలమైనది? ఆలోచిస్తే మనకు, మనల్ని ప్రోత్సహిస్తున్న వారికి (సంఘుకాపరులకు) అనుకూలమైనది. సమయాన్ని, హృదయాన్ని దేవునికి ఇవ్వక, లోకానుసరమైన మన నడవడికి, మన దైనందిన కార్యక్రమాలు కొనసాగిం చడానికి ఎటువంటి ఇబ్బంది లేని విధంగా మనం చేసే ఉపవాసం దేవునికి అనుకూలం కాదని, అట్టివారి ప్రార్ధన దేవుడు వినడని వాక్యం సెలవిస్తుంది.

*నీ ఆహారము ఆకలిగొనినవారికి పెట్టుటయు, నీ రక్త సంబంధికి ముఖము తప్పింపకుండుటయు, దిక్కుమాలిన బీదలను నీ ఇంట చేర్చుకొనుటయు వస్త్రహీనుడు నీకు కనబడినపుడు వానికి వస్త్రములిచ్చుటయు ఇదియే గదా నాకిష్టమైన ఉపవాసము.*

మనం తినకుండా ఉండటం ఉపవాసం కాదు, ఆకలితో ఉన్న వారికి పెట్టునిమిత్తం అవసరమైతే మనం తినకుండా ఉండటం ఉపవాసం. మనం తినవలసిన దానిని ఆకలితో ఉన్న వారికి పెట్టి మనం ఆకలితో ఉండుటకు ఇష్టపడితే అది దేవునికి ఇష్టమైన ఉపవాసమట. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అంటే ప్లాన్ ప్రకారం క్రిస్మస్‌కో, ఈస్టర్‌కో, నీవు చేసే అన్నదానం కాదు. దేవుని నిమిత్తం ఆకలితో ఉన్నవారికి అన్నంపెట్టుటకు నీవు పస్తుండాలి. నిన్ను నీవు ఆయాసపరుచుకొవాలి. అన్నదానంలో నీ పాలుపంపులు ఏమి ఉండవు, కేవలం డబ్బులుంటే చాలు. డబ్బులు ఉన్నప్పుడే అన్నదానం చేస్తావు అది కూడ అందరి మెప్పుకొరకో, లేక నీ ప్రియుల సంతోషం నిమిత్తమో అన్నదానం చేస్తావు తప్ప అందులో దేవుడు ఉండడు కాబట్టి అటువంటి అన్నదానం దేవుడు చూడడు. బీదలకు దయ చూపటం, బట్టలు లేనివారికి బట్టలు ఇవ్వడం వంటివి కొందరు చేస్తుంటారు అయితే ఆ పనులను హృదయ పూర్వకంగా చేయడం, అందునిమిత్తం ఇబ్బంది పడుట కైనను, నష్టపోవుటకైనను సిద్ధపడటమే నిజమైన ఉపవాసం.

*"అలాగున నీవు చేసిన యెడల నీ వెలుగు వేకువ చుక్కవలె ఉదయించును స్వస్థత నీకు శీఘ్రముగా లభించును నీ నీతి నీ ముందర నడుచును. యెహోవా మహిమ నీ సైన్యపు వెనుకటి భాగమును కావలి కాయును అప్పుడు నీవు మొఱ్ఱపెట్టగా ఆయన - నేనున్నాననును"*

ఆయనకు ఇష్టమైన ఉపవాసం చేసి మనం పిలిస్తే పలుకుటకు ఆయన సిద్ధంగా ఉంటానని దేవుడే స్వయంగా చెప్తున్నాడు. ఆయన కాపుదల మనకుంటుందని వాక్యం సెలవిస్తుంది. కాబట్టి లోకానుసారమైనది కాక, వాక్యాను సారమైన దేవునికి ఇష్టమైన ఉపవాసం చేయుటకు నీవు సిద్ధపడుము. కేవలం లెంట్‌డేస్ లో మాత్రమే చేసేది ఆచార పరమైన ఉపవాసం. నిత్యం దేవునికి ఇష్టమైన ఉపవాసం చేయుటకు యోగ్యమైనదిగా హృదయాన్ని మార్చుకోవాలి అందులకు బైబిల్ ఎంతో ఖచ్చితంగా చెప్పుచున్న ఈ విషయాల ను జాగ్రత్తగా పరిశీలించి వాటికి అనుగుణమైన భక్తిక్రియలను కొనసాగించాలి. అందుకు ఈ లోకమునకు ఎదురీదవలసి వస్తుంది. దానికి కావలసిన మానసిక సిద్ధపాటు కొరకు దేవునితో సమయాన్ని గడపాలి. ప్రార్థన, వాక్యధ్యానం ద్వారా దేవునితో సమయాన్ని గడుపుతూ విశ్వాసాన్ని పెంపొందించుకుంటే దేవునికి ఇష్టమైన ఉపవాసం చేయగలుగుతాము.

*"ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు దుఃఖించుచు ....... మీ వస్త్రములను కాక మీ హృదయములను చింపుకొని ఆయన తట్టు తిరుగిడి" యోవేలు 2:12,13*

# స్వస్థపరచిన దేవుడు

నా పేరు గొల్లపల్లి ఇస్సాకు. మా స్వగ్రామము క్రిష్ణాజిల్లా అవనిగడ్డ తాలూకా బావుదేవరపల్లి. మా తల్లిదండ్రులకు మేము 8మంది సంతానం. నేను 4వవాడిని. నా తల్లిగారైన సుజ్ఞానమ్మగారు నేను గర్భములో ఉన్నప్పుడు నన్ను కనలేని పరిస్థితిలో అనగా ఎగినపాడు గ్రామము నుండి ఉయ్యూరు రావటానికి రాత్రి 12 గంటలకు రవీస్ కాలువ దాటడానికి బల్లకట్టు యజమాని లేనందున, బల్లకట్టు ఆ దరిన ఉన్నందున వాళ్ళు ఏమి చేయలేని పరిస్థితిలో నా తండ్రిగారు, నా తల్లిగారు, మా నాయనమ్మ గారు పుట్టబోయే బిడ్డను యేసుప్రభువుకు సమర్పించు కుంటాము అని దేవునికి ప్రమాణము చేసిన కొంతసేపటికి దేవుని కృపవలన నన్ను ప్రసవించిందట. నా తల్లిగారు చిన్నతనము నుండి నన్ను దేవునిలో పెంచుతూ యేసుక్రీస్తును గురించి అనేక విధములుగా చెబుతూ ఉండేవారు. కాని నేను ఆమె చెప్పిన మాట వినేవాడను కాను. ఎగినపాడు గ్రామము నుండి మా తల్లిదండ్రులు అవనిగడ్డ తాలూకా బావుదేవురపల్లి అనే గ్రామము వచ్చారు. నాకు 16 సం॥లు వచ్చేవరకు దేవుడు నన్ను వెంబడిస్తూ ఉండేవాడు. కాని నేను అంధకారం అనే చీకటిలో ఉండి దేవుని గుర్తిచలేకపోయాను. 1977నవంబరులో వచ్చిన తుఫానులో దివి తాలూకా అంతా కొట్టుకుపోయింది. అప్పుడు అనేకమంది ఒక హైస్కూని పైకి ఎక్కారు. వారిలో నేను కూడా ఒకడిని. సముద్రపు నీరు ఎక్కువగా వచ్చి హైస్కూలు మునిగిపోయి అందరూ చనిపోయారు. కానీ దేవుడు నన్ను ఒక్కడినే బ్రతికించాడు. నాకు 18సం॥ల వయస్సులో వివాహం చేశారు. 1980లో చిన్నకారు డ్రైవింగు నేర్చుకొని విజయవాడలో యనమలకుదురు అనే గ్రామం వచ్చాను. మోటారు ఫీల్డులో నేను అనేక దుర్వ్యసనాలకు అలవాటు పడ్డాను. నాకు ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత నా భార్య చనిపోయింది. 1992వ సంవత్సరం మే నెలలో ఒక రోజు నేను లారీ పరదా లాగుచుండగా నా నోటిగండా అరలీటరు రక్తం పడింది. వెంటనే విజయవాడలో హార్ట్ స్పెషలిస్ట్ దగ్గరకు తీసుకెళ్ళారు. ఆయన స్కానింగ్ తీసి ఇతనికి ఎప్పటి నుండో ఎముకల టి.బి. ఉంది. ఇప్పుడు గుండె పెరిగింది. ఇతను ఇంక మూడు రోజుల కంటే ఎక్కువ బ్రతకడు అని చెప్పి ఇంటికి పంపించాడు. కాని నెలరోజులైనా నేను చనిపోలేదు. మా నాన్న ఇంట్లో సామానంతా అమ్మి నాకు భూత వైద్యం చేయించాడు. మా అమ్మ అంతక్రితం కేన్సర్ వ్యాధితో మరణించింది. ఆ భూత వైద్యుడు నన్ను కొట్టి జుట్టంతా పీకేశాడు. ఆ దెబ్బలతో నేను చాలా రోజులు బాధపడ్డాను. ఆ తరువాత నా చిన్న తమ్ముడి భార్యయైన చిన్నారమ్మ తన చిన్నతనము నుండి ప్రభువును నమ్ముకుంది. ఆమె నా దగ్గరకు వచ్చి బావగారు మీరు ప్రభువు నమ్ముకోండి. మీ తల్లిగారు మిమ్మును ప్రభువు సేవకు సమర్పించిన సంగతి మీకు తెలుసు గనుక మీరు ప్రభువు పాదసన్నిధికి వచ్చినట్లయితే ప్రభువు మిమ్మల్ని స్వస్థపరుస్తాడు అని చెప్పింది. ఆమె చెప్పినట్లే మందిరానికి వెళ్ళడం ప్రారంభించాను. నేను యేసుప్రభువా అని వచ్చి రాని ప్రార్థన చేసుకుంటున్నాను. అప్పుడు రెండు హస్తములు నా దగ్గరకు వచ్చి, నా ప్రక్కటెముకలును తీసివేసి క్రొత్తవి సమకూర్చినవి. ఆ రోజు ఉదయం నుండి నాకు గొప్ప ఆరోగ్యం వచ్చింది. కాని కొన్ని రోజుల తర్వాత ఆ గ్రామంలో కోడి పందాలు చూడటానికి వెళ్ళాను. ఆ సమయంలో ప్రభువు ఉగ్రత నా మీదకు వచ్చి నా ఎముక లన్నీ నొప్పులు వచ్చి ఎగశ్వాస వచ్చింది. నేను ఇంటికి వచ్చాను. నా పరిస్థితి చూసి అందరూ నన్ను ఆసుపత్రికి తీసుకెళ్ళే సమయంలో నేను నిర్ణయం తీసుకున్నాను. ఆది నుండి మన పితరులను కాచి కాపాడిన జీవము గల దేవుడు ఈ రోజు నన్ను కూడా కాపాడతాడన్న పూర్తి విశ్వాసం కలిగింది. నా చిన్నతనం నుండి నా తల్లి చెప్పిన

మాటలు నాకు గట్టి నమ్మకాన్ని కలిగించాయి. సాయంత్రం నేను నా గదిలోకి వెళ్తూ మా ఇంటిలో అందరినీ పిలిచి, 'నేను మీకు రెండు నిర్ణయాలు చెబుతున్నాను. నేను చనిపోతే దేవుని సేవకులను పిలిపించి నన్ను పాతిపెట్టండి. బ్రతికితే ప్రభువు పాదసేవ చేస్తానని చెప్పి ఆ రాత్రి12 గంటలు వరకు మోకరించి ప్రార్థన చేస్తున్నాను. ఆ సమయంలో నాకు ఒక దర్శనం కలిగింది. 1993 జనవరి1వ తేదిన నేను బాప్తిస్మము పొందాను. నేను ప్రభువు సేవలో సాగిపోవుచుండగా మా తల్లిదండ్రులు వివాహం చేసికొమ్మని నన్ను బలవంతం చేశారు. 1995సంవత్సరం బెంగళూరులో ఉన్న బమానగర్ పాస్టర్ సభలు పెట్టించాడు. అక్కడ ప్రభువు నన్ను బాగా వాడుకున్నాడు. నేను తిరిగి వచ్చేటప్పుడు ప్రభువు నాతో వివాహం చేసికొమ్మని మాట్లాడాడు. నాకు గుంటూరులో రిజిష్టర్ మ్యారేజి జరిగింది. మేము కృష్ణాజిల్లాలో ఉండకూడదని తీర్మానించు కొని ఒంగోలు క్లోపేటలో పాస్టర్స్ సదస్సు జరుగుచుండగా అక్కడికి వెళ్ళాము. అక్కడి స్థానిక పాస్టర్‌గారి సహాయంతో ఈతముక్కల పల్లెపాలెంలో సంఘం స్థాపించి సంఘ పరిచర్య చేస్తున్నాను. దేవుడు నాకు అనుగ్రహించిన స్వస్థత వరము వలన అనేక మందిని దేవుడు స్వస్థపరిచాడు. దేవునికి స్తోత్రముల్.

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యము ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

**చందాదారుల వివరములు**

1. అపో. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
2. దాసరి శ్యామ్ హయ్యర్ పాల్ - 2000 (నెలకు)
3. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000 (నెలకు)
4. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
5. ముద్ద సామ్యేల్ విల్సన్ - 500 (ప్రతి నెల)
6. జి. స్టాలిన్ (కావలి)
7. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
8. సుమతి చక్రవర్తి
9. దాసరి. మాధవరావు
10. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
11. జి. కళావతి, ఒంగోలు 350/-
12. వి. కస్తూరి, భీమవరం 500/-
13. జయ, గుంటూరు - 1500/-
14. కె. రజిని, నరసరావుపేట - 1000/-
15. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

## పాఠకులకు గమనిక

**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**

కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,
ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక
6వ లైను, క్లోపేట, ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726

# కాలానికి కేంద్రం క్రీస్తే!

"కాలములను సమయములను తండ్రి తన తన స్వాధీన మందుంచుకొని యున్నాడు..." (అపో.కా.1:7) కాల గమనానికి గమ్యం లేదు. అది నిరంతర చక్రభ్రమణ ప్రక్రియ. దానిని నియంత్రించగల, శాసించగల శక్తి ఈ ప్రపంచంలో ఏ శాస్త్రవేత్తకు లేదు! ఆ కాలచక్ర పరిధిపై నిలబడిన మానవుడు, ఎప్పుడో ఒకప్పుడు తన ఉనికిని కోల్పోయి కాలగర్భములో కలిసిపోవాలే గాని, కాలానికి కళ్ళెం వేసి కలకాలం బ్రతికే ప్రసక్తే లేదు! యిది సృష్టి నియమం. ఆ నియమానుసారం మానవుడు సాగించే జీవన్మరణ పోరాటానికి పట్టిన కాల పరిమితిని, ఒక తరం తర్వాత యింకొక తరం తరలిపోతూ సాగించిన మానవ జీవన యాత్రావిశేషాలను, ప్రజల నాగరికతను, యుద్ధాలను, విధ్వంసాలను, ప్రకృతి విస్ఫోటాలను, ప్రయోగాన్వేషణలను... ఆ కాలపరిధి పై గుర్తించి రాబోవు తరాలకు శాస్త్రీయమైన చరిత్రను అందించాలనే జిజ్ఞాసలో ఉద్భవించినదే 'కాలమాన పట్టిక' (క్యాలెండర్).

భూమి తన కక్ష్యలో తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుటకు పట్టిన ఒక్కొక్క 'సూర్యాస్తమయ- ఉదయాస్తమయమును' 365 ప్రదక్షణములుగా గణనం చేసిన మెసపొటోమీయులు 'సుమేరియన్' కాలమాన పట్టికను ప్రథమంగా ప్రపంచానికి పరిచయం చేశారు. ఐగుప్తీయులు, అస్సేరీయులు, ఎలమయితీయులు... ఆ కాలమాన పట్టికనే అనుసరించి దానికి వారి వారి సాంప్రదాయ పేర్లను అన్వయించి, ఆ ప్రదక్షణల కాలాన్ని పది మాసములుగా విభజించి, ఆ భ్రమణ గతిని ఒక సంవత్సరంగా పరిగణించారు (3100 బి.సి.).

క్రీ.పూ. 1079 లో పారశీక శాస్త్రవేత్తయైన ఖయ్యామ్ సూర్యుని కేంద్రంగా ఒక సంవత్సర భూభ్రమణ కాలాన్ని 365.24219858156 (365 రోజులు 05 గంటలు 48 నిమిషాల 46 సెకండ్లు) అని ఖచ్చితంగా గణనం చేసి, సూర్యుని 7 అస్తమయ-ఉదయాలను 'ఒక వారం'గాను, 30 సూర్యాస్తమయ ఉదయాలను 'ఒక మాసం'గాను, 365. 2421... సూర్యాస్తమయ-ఉదయాలను 'ఒక సంవత్సరం' గాను కాలాన్ని విభజించాడు.

కానీ వారు తయారు చేసిన ఏ ఒక్క కాలమాన పట్టిక లోని మాసములు, దశాంశం(డెసిమల్)లో వున్న భూభ్రమణ పరిధిని శేషం లేకుండా శాస్త్రీయంగా విభాగించ లేదు. అందు వలన ఋతువులననుసరించి ఏర్పరుచుకున్న పండుగలు సరియైన ఋతువులలో వచ్చేవి కావు. ప్రపంచంలో ఎన్ని రకాల కాలమాన పట్టికలు (సుమారు 40) వున్నా, అవన్నీ సూర్య చంద్రులను కేంద్రగా చేసికొని రచించినవే. వాటిలో-

1. సూర్య కేంద్ర సరణి: సూర్యుని ఆధారంగా చేసికొని లెక్కించిన కాలగమన పట్టిక (365 రోజుల సోలార్ సిస్టమ్).

2. చంద్ర కేంద్ర సరణి: చంద్రుని ఆధారంగా చేసికొని లెక్కించిన కాలగమన పట్టిక (354 రోజుల లూనార్ సిస్టమ్).

3. సూర్యచంద్రుల సమన్విత సరణి: రెంటిని ఆధారంగా చేసికొని లెక్కించిన కాలగమన పట్టిక (360 రోజుల హీబ్రూ సిస్టమ్).

1. సామ్రాట్ విక్రమాదిత్యుని (102 బి.సి.) పర్యవేక్షణలో చంద్రయానమును శుక్ల (నెల పొడుపు నుండి పౌర్ణమి 15 రోజులు), కృష్ణ (పౌర్ణమి నుండి నెలపొడుపు 15 రోజులు) పక్షములుగా విభజించి, 12 మాసముల కాలమాన పట్టికను భారతదేశానికి పరిచయం చేయబడింది. దీనినే విక్రమ్ సంవత్ హిందూ కాలమాన పట్టిక అంటారు. భారత దేశంలో అతి ప్రాచీనమైన పట్టిక యిదే. ప్రస్తుతం ఈ పట్టిక నేపాల్ దేశంలో వాడుకలో వుంది.

2. కూషాణులపై విజయం సాధించిన సాకా చక్రవర్తి పర్యవేక్షణలో రూపొందించబడిన 12 మాసముల సూర్యమాన కాలమాన పట్టిక (375 ఏ.డి.). దీని పేరు సాకా సంవత్. దీనినే తెలుగు కాలమాన పట్టిక అంటారు. ప్రస్తుతం ఈ పట్టికను ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలు యిప్పటికి వాడుకొంటున్నాయి.

3. చంద్రయానమును అనుసరించి తయారు చేసిన ఇస్లామిక్ కాలమానపట్టిక కేవలం అరబీయులు ఉపయోగిస్తున్న హిజీ కాలమానపట్టిక (622 ఏ.డి.). ఇది పన్నెండు నెలల పట్టిక. మొహరం మాసంలో నూతన సంవత్సరం ప్రారంభమౌతుంది

ఈ మూడు కాలమాన పట్టికల కంటే అతి ప్రాచీనమైనది, అతి క్లిష్టమైనది, నేటికీ వాడుకలో వున్నది "హెబ్రీ కాలమాన పట్టిక". దీనినే (బిబ్లికల్ క్యాలెండర్) అనికూడా అంటారు. ఈ కాలమాన పట్టికలో నెలలను చంద్రుని గమనముతోను,

సంవత్సరములను సూర్యుని గమనముతోను లెక్కిస్తారు! ఈ పట్టిక దినాంకాలను లెక్క వేయుటకే గాక, సృష్టినిర్మాణ విధానాన్ని, గ్రహ చలనములను, చరిత్ర సమయాన్ని మరియు పరిశుద్ధ గ్రంథ సంభవాలను అంచనా వేయగలదు. ఈ పట్టిక ద్వారానే 9 వ శతాబ్దపు యూదులు సృష్టి ప్రారంభం 3761 బి.సి.లో జరిగిందనే నిర్ధారణకు వచ్చారు. కానీ భూభ్రమణ పరిధిని ఖచ్చితంగా లెక్కించలేని కారణంగా, వారి అంచనాలు అప్పుడప్పుడు సమన్వయం చెందేవి కావు. ఖయ్యాం లెక్కించిన పరిధిని ఎవరూ సంపూర్తిగా అధిగమించలేక పోయారు. అయితే ఒక ప్రామాణికమైన కాలమాన పట్టికను తయారు చేయుటకు, భూమి తన ప్రయాణాన్ని ఆరంభించి ముగించే 'ఖచ్చితమైన బిందువు'ను భూకక్ష్యపై ఎక్కడ గుర్తించాలి?

ఈ కాలగమన గణనమునకు మూలాధారం సూర్య జ్యోతి, చంద్రజ్యోతి. (ఆది. 1:14,15)

అదృశ్యుడు, ఊహాతీత శక్తిమంతుడు, అపరిమిత జ్ఞాన సంపన్నుడు అయిన దేవుడు శూన్యంలో సూర్యజ్యోతిని భూగ్రహమునకు అతిసమీపంగా అనగా 146 మిలియన్ కి.మీ. దూరంలో ప్రతిష్టించాడు. ఆ స్థలమును (పెరిహెలియన్) కాల గమనానికి ప్రారంభ, ముగింపు బిందువుగా ఏర్పాటు చేశాడు. ఆ బిందువు వద్ద భూమి తన ప్రయాణాన్ని మొదలు పెట్టిన ఆ క్షణమే నూత సంవత్సర ఆరంభానికి నాంది. స్థానంలోనే భూమి తన ప్రయాణాన్ని 365.24219... రోజుల్లో ముగిస్తుంది. ఆ ప్రక్రియ పేరే "జనూస్" (గాడ్స్ న్యూ బిగినింగ్).

జనూస్– సూర్య వలయంలో సరళరేఖపై (180 డిగ్రీలు) ఆసీనమై వున్న రోమీయుల ద్విముఖ దేవత . దాని ఒక ముఖం పెరిహీలీన్ (భూభ్రమణ బిందువు జనువరి ఒకటి) వైపు చూస్తూ వుంటే, వేరొక ముఖం భూకక్ష్యపై 152 మిలియన్ కి.మీ. దూరంలో వున్న ఆఫీలీన్ బిందువును (భూభ్రమణ బిందువు జూలై ఒకటి) చూస్తూ వుంటుంది. అంటే ఆ ప్రతిమ చూపు ఒక సరళ రేఖలా ప్రసరించి భూభ్రమణ పరిధియైన 365.24219858156 రోజులను అర్ధభాగంగా ఖండిస్తోంది. గ్రెగోరియన్ క్యాలండర్ నిర్మాణంలో ప్రాముఖ్యమైన పాత్ర వహించింది ఈ సమవిభజనే (బిసెక్షన్).

ఒక ప్రామాణికమైన కాలమాన పట్టికను తయారు చేయుటకు శూన్యంలో ఆ పెరిహేలియన్ స్థానాలన్ని గుర్తించడం ఎలా?

చాంద్రమాన కాలపట్టికలో వున్న లోపాలను, సూర్య చంద్ర కాలమాన పట్టికలలోగల వ్యత్యాసాలను తొలగించాలంటే మొదట చరిత్రను విభజించే ఒక సందర్భాన్ని ప్రామాణికంగా ఎన్నుకోవాలి. ఆ ఎన్నుకొన్న ప్రామాణిక రేఖే 'క్రీస్తు పుట్టుక!' ఆ ప్రామాణిక రేఖకు దిగువన జరిగిన చరిత్రను క్రీ.పూ. (బి.సి.)గా, ఎగువన జరుగుతున్న చరిత్రను క్రీ.శ. (ఏ.డి.)గా విభజించి, సూర్య,చంద్ర కాలమాన పట్టికలను 365 రోజులతో తయారు చేశారు. ఆ పట్టికలన్నీ పది నెలల సంవత్సరంతో పొందుపరచి 'మార్చి నెల'తో ఆరంభమైనవే ! అయినా ఆ రెండు గ్రహ చలనముల మధ్యనున్న 2422... రోజుల దూరాన్ని అధిగమించలేక పోయారు. కొంతకాలం తర్వాత "నూమా పొంపిలియా" అనే శాస్త్రవేత్త సూర్య కేంద్రంగా 365.24 రోజులతో పన్నెండు నెలల సంవత్సర కాలమాన పట్టికను తయారు చేశాడు గానీ మిగిలిన 11 నిముషముల వ్యత్యాసాన్ని తొలగించ లేకపోయాడు. క్రీ.శ 1582లో ఆనాటి "పోపు గ్రెగోరియన్" ఆధ్వర్యములో రోమన్ తత్వవేత్తయైన "సోంపేజీనాస్" పది నెలల క్యాలెండర్‌కు మరి రెండు నెలలను (జనువరి) ఒక అధిక నెల (ఫిబ్రవరి)ను చొప్పించి ఆ 11 నిముషముల వ్యత్యాసాన్ని తొలగించి, దేవుడు ప్రతిష్టించిన పెరిహేలియన్ స్థానాన్ని చేరుకొని, ఈ భూమి మీద జరిగి పోయిన, జరుగుతున్న ప్రతీ సందర్భాన్ని, సంఘటనలను క్రీస్తు పుట్టుకతో ముడివేసి, ఈనాడు మన వాడుకలో వున్న "గ్రెగోరియన్ క్యాలెండర్"ను ప్రపంచానికి పరిచయం చేశాడు. ఈపట్టిక విశ్వవ్యాప్తంగా ఆమోదింపబడి సృష్టినే పరిశోధిస్తుంది!

ఈ నిర్దిష్టమైన "గ్రెగోరియన్ కాలమాన పట్టిక" రూపు దిద్దుకొనుటకు దోహదమైన కాలపట్టికలలో – సుమేరియన్, విక్రమ్ సంవత్, సాకా సంవత్, హెబ్రీ, హిజిరి కాలపట్టికలు ప్రాముఖ్యమైనవి.

గ్రెగోరియన్ కాలమాన పట్టికను ప్రపంచం ఆమోదించిన తర్వాత అప్పటివరకు మార్చి నెలలో (చైత్రం) జరుపుకొంటున్న సంవత్సర ఆరంభమును సృష్టి నియమానుసారం జనవరి మొదటి తేదికి అన్వయించబడింది.

'కాలానికి కేంద్ర బిందువు క్రీస్తే! చరిత్రకు మూలాధారం క్రీస్తు పుట్టుకే!' ప్రతీ నూతన సంవత్సరం నూతన ఆశీర్వాదా లతో క్రీస్తు మనలనందరిని నిత్య నూతన రాజ్యానికి నడుపును గాక! ఆమెన్

రెవ.డా.ఏ.యన్. ఆర్. జక్కం 7039470294

చిన్నపిల్లల పేజి

# నెరవేరిన కల

ఒకప్పుడు ఒక కొండ పైన ఒక చిన్న లోయకు ఎదురుగా మూడు చెట్లు ఉండేవి. అవి ఎంతో కాలంగా కలిసి ఉన్నందున అవి వాటి భవిష్యత్తు గురించి, ఆశలు గురించి చర్చించుకున్నాయి .

ఏదో ఒక రోజు నేను నిధులు, రత్నరాశులు దాచబడే పెట్టెగా ఉండాలని ఆశిస్తున్నాను బంగారం వెండి మరియు విలువైన రత్నాలతో నిండి ఉండాలని కోరుకుంటున్నాను. నేను గొప్ప గొప్ప శిల్పాలతో అలంకరింపబడి ఉండగా అందరూ నా అందాన్ని చూసి నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటున్నాను అన్నది మొదటి చెట్టు. ఏదో ఒక రోజు నేను శక్తివంతమైన ఓడగా మారతాను. భూమి మీది అనేకమైన సుందర ప్రాంతాలను చూస్తు, ప్రజలకు చూపిస్తూ నేను రాజులను, రాణులను, భూమి మీది గొప్ప గొప్ప వారిని సముద్రాలు దాటించి వారి వారి గమ్యస్థానాలకు భూమి మూలలకు వారిని సురక్షితంగా చేరవేస్తూ ఉండాలని కోరుకుంటున్నాను అన్నది రెండవ చెట్టు. చివరిగా మూడవచెట్టు నేను ఇక్కడే ఉండి అడవిలో నిటారుగా ఎదుగుతూ అన్నిటికంటే ఎత్తైన చెట్టుగా ఎదగాలనుకుంటున్నాను. నా కొమ్మలు ఆకాశానికి అంటుచు న్నందున ప్రజలు స్వర్గం గురించి ఆలోచించినప్పుడు వారికి నా కొమ్మలు గుర్తుకొస్తాయి. ప్రజలు ఎల్లప్పుడు నన్ను గుర్తుచేసుకుంటారు అన్నది. వారి కలలు నెరవేరాలని అవి కొన్ని సంవత్సరాలు ప్రార్థించాయి. కొంతకాలానికి చెట్లు నరికేవారు వచ్చారు. ఒకతను మొదటి చెట్టు వద్దకు వచ్చి ఈ చెట్టు చాలా బలంగా ఉంది దీన్ని నరికి వడ్రంగి వానికి అమ్మితే మంచి లాభం వస్తుంది అన్నాడు. తను వడ్రంగి చేతిలో పడితే అతను తనను ధననిధిగా మార్చగలడు కదా అని సంతోషించింది మొదటిచెట్టు. మరొకడు రెండవ చెట్టు వద్దకు వచ్చి ఈ చెట్టు బలంగా ఉంది దీనిని నౌకలు తయారు చేసే వానికి ఇస్తే మంచి లాభం వస్తుంది అనుకున్నాడు. నౌకగా మారాలనే తన కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా చనిపోయేందుకు సిద్ధపడింది రెండవ చెట్టు. చివరి అతను మూడవ చెట్టు వద్దకు వచ్చి ఈ చెట్టేమి అంత ప్రత్యేకంగా లేదు. ముందు దీనిని నరికి ఇదెలా ఉపయోగపడుతుందో తర్వాత ఆలోచిస్తాను అన్నాడు. ఆ మాట వినగానే మూడవ చెట్టు భయంతో ఇక తన కలలు ఎప్పటికి నెరవేరవు అనుకున్నది.

మొదటి చెట్టు సంతోషంగా వడ్రంగి వద్దకు చేరింది కాని అతడు ఆ చెట్టు చెక్కతో పశువులకు దాణాపెట్టె తొట్టిని తయారు చేశాడు. అతివిలువైన ధనరాసులతో, విలువగల రత్నాలతో కాక, జంతువులకు వేసే దాణా ఎండు గడ్డితో నింపబడే సాధారణమైన పశువులతొట్టిగా మారడంతో తన కల నెరవేరనందుకు నిరాశచెందింది.

రెండవచెట్టు నౌకలు తయారుచేసే వ్యక్తి చేతిలోకి వెళ్ళింది కాని అది అతి పెద్దదైన నౌకలా కాక చిన్న పడవలాగా మత్స్యకారులుకు ఉపయోగపడే చిన్న దోనెగా తయారు చేయబడింది. రాజులను రాణులను మోస్తూ వారి గమ్య స్థానాలకు చేర్చాలనే తన కోరిక తీరనందుకు బాధపడింది రెండవచెట్టు.

మూడవ చెట్టు పెద్ద పెద్ద కొయ్యలుగా కత్తిరించబడి కొంతకాలం నిరుపయోగంగా చీకటిలో ఉంచబడింది.

కొంతకాలానికి ఒక యువజంట వచ్చి పశువులపాకలో ఉండి ప్రసవించి తనకు పుట్టిన బిడ్డను ఆ పశువుల తొట్టెలో పడుకుండబెట్టారు. అతనికోసమే అన్నట్లు సరిపోయింది ఆ పశువుల తొట్టె బాలయేసునకు. ఈ ప్రపంచంలో అందరి కంటె గొప్పవాడు అనేక రత్నరాసుల కంటే విలువైన వాడు పశువుల తొట్టెగా ఉన్న తన ఒడిలో పడుకోబెట్టబడడంతో ధననిధిగా ఉండాలనే తన కల నెరవేరినందుకు సంతోషించింది మొదటిచెట్టు.

**(మిగితాది 19వ పేజీలో)**

# కృపాదానం

1952లో కృపాదానంగారు కృష్ణాజిల్లా ఆకిరిపల్లి మండలం ఈదర గ్రామంలో పాదిరిగా మెట్రోపాలిటన్ చర్చ్‌లో పనిచేశారు. అప్పుడు వారికి తొమ్మిదిమంది సంతానం. పెద్దకుమార్తె ఒంగోలులో హైస్కూలు చదువుటకు ఏర్పాటు చేసి, మార్త, శ్యామ్, జోసఫ్‌లను ఆకిరిపల్లి హై స్కూలులో సెకెండ్, థర్డ్ ఫారాలలో చేర్పించాడు కృపాదానం.

స్కూలుకు వెళ్ళాలంటే ప్రతిరోజు ఈదర నుండి ఆకిరిపలికి నడిచి వెళ్ళాలి. ఉదయం ఎనిమిది కిలోమీటర్లు, సాయంకాలం ఎనిమిది కిలోమీటర్లు నడవాలి. ఓ వారం రోజులు స్కూల్‌కి వెళ్ళిన తర్వాత రోజూ 16కిలోమీటర్లు నడవడం చాలా కష్టమని గ్రహించి, ఒంగోలులో తను చదివిన ఎ.బి.యం. హైస్కూలులోనే పిల్లలను చదివించా లనుకున్నాడు. తన పెద్దకుమార్తె పిల్లలను చూసుకోగలదని యెంచి నాటి హెడ్‌మాస్టర్ రవివర్మగారికి ఉత్తరం వ్రాసి పిల్లల సీట్లు నిర్ధారించుకొని ఒంగోలు స్కూలులో చేర్చి, ఒంగోలు నుండి తిరుగు ప్రయాణమైనాడు రైలులో. రాత్రి ఎనిమిది గంటలకు విజయవాడలో రైలు దిగి గొల్లపల్లి బస్‌స్టాప్‌లో ఆకిరిపల్లి బస్ఎక్కాడు. నాటి రోజుల్లో బస్సులకు కప్పు ఉండేది కాదు. కూర్చోవటానికి చెక్క బెంచీలు, ఆ బెంచీలు చెక్క ఫ్లోరింగ్‌నకు సీలలతో బిగించి ఉండేవి. చెక్క బెంచీలకు ప్రక్కన చెక్క స్థంభాలను పైన ఉన్న చెక్క టాపునకు బిగించేవారు. బస్ పెట్రోలు డీజిలుతో కాక నీటి ఆవిరితో నడిచేది. అందువలన బస్ వెనుక పెద్ద నీళ్ళడ్రమ్ము, ఓ పెద్ద బొగ్గుల పొయ్యిమీద బిగించి కట్టబడి ఉండేది. రాత్రి 9 గంటలకు ఆకిరిపల్లి చేరింది బస్సు. ఆకిరిపల్లిలో బస్సుదిగి నాలుగుమైళ్ళు మట్టి రోడ్డుమీద నడిచిన తర్వాత చినుకులు ప్రారంభమయ్యాయి. ఈదర గ్రామానికి రోడ్డు లేదు. గుఱ్ఱపు బండ్లు కాని ఒంటెద్దు బండ్లుకాని లేవు. రాత్రి బస చెయటానికి బస్టాండు లేదు. సత్రంలో క్రైస్తవులకు చోటులేదు. సన్నని వర్షం పడుతుంది. ఈదర వరకు మార్గం చిట్టడవి, కాలిబాట. ఊరి బయట చెరువు వద్ద ఓ ఇంటి అరుగు మీద ఈదర గ్రామానికి చెందిన యువకుడు నిలబడి ఉన్నాడు. వర్షం కారణంగా కృపాదానంగారు కూడా ఆ అరుగు మీద నిలుచున్నాడు. పాదిరిగారు మీరు ఈ రాత్రి ఇక్కడ పండుకుంటారా? అన్నాడు ఆ అబ్బాయి. లేదు, నేను ఈదర వెళ్తాను అన్నాడు కృపాదానం. ఈ చీకట్లోనా? అన్నాడు ఆ అబ్బాయి. ప్రభువు ఉన్నాడు అన్నాడు కృపాదానం. రాత్రులు కూడా యేసు ప్రభువు ఉంటాడా? అని అడిగాడు. ప్రభువుకు రాత్రి పగలు అని భేధం ఉండదు అన్నాడు కృపాదానం. అయితే నేను కూడా వచ్చేదా? అన్నాడు. సరే అన్నాడు కృపాదానం. వర్షం తగ్గింది. కాని చల్లని గాలి విసురుతుంది. ఇటువంటి అనుభవం చాలాకాలం క్రితం తెలంగాణా పెద్దపల్లి అడవుల లో పాదిరిగా పని చేసేటప్పుడు కలిగింది. పదండి అన్నాడు యవ్వనస్తుడు. ఉండు ప్రార్థన చేసుకుందాము అని ప్రార్థన చేసుకొని బయలుదేరారు ఇద్దరు. ఊరు దాటిన తర్వాత రెండు మూడు కాలిబాటలు మసకగా కనిపిస్తున్నాయి. ఆ అబ్బాయి పాదిరి ముఖంలోని చూస్తున్నాడు. ఇప్పుడెలా ప్రభువా అని కృపాదానం పెద్దగా ప్రార్థన చేశాడు. చిన్నగా ప్రార్థన చేస్తే ఆ అబ్బాయికి వినబడదు. ప్రార్థన ఆపంగానే ఓ పెద్దమెరుపు మెరిసింది. దారి స్పష్టంగా కనిపించింది. నడువవలసిన కాలిబాట మెరుస్తుంది. ఒక మైలు నడిచిన తర్వాత మరలా అదే పరిస్థితి. చుట్టు ప్రక్కల ఎక్కడా కరెంటు లేదు. విజయవాడ, నూజివీడు వంటి పట్టణలలో తప్పితే చాలా కొద్ది గ్రామాలలో కరెంట్ ఉండేది. మొత్తం అయిదు సార్లు దారి కనిపించనప్పుడు నిలిచి పెద్దగా ప్రార్థన చేయడం, ప్రార్థన ముగిసిన తర్వాత పెద్ద మెరుపు, ఆ మెరుపులో నడువ వలసిన దారి మాత్రం మెరుస్తూ కనిపించడం జరిగింది. రాత్రి 12 గంటలకు ఈదర గ్రామం చేరారు. మరునాడు సాయంకాలానికల్లా చీకట్లో పాదిరిగారు ప్రార్థన చేసి మెరుపు పుట్టించి దారి కనుక్కొని నడిపించాడు అనే వార్త ఈదర గ్రామమంతా మారుమ్రోగిపోయింది.

1955లో రామాయపట్నం సెమినరీ నుండి ఒంగోలు వచ్చిన కృపాదానంకు పాస్టరు ఉద్యోగం దొరకలేదు.

పదిమంది సంతానం.కుటుంబ పోషణకు మద్రాసులోని బెస్ట్ అండ్ కంపెనీ వారి ఉద్యోగంలో చేరాడు. కంపెనీ వారు, వారి ప్రొడక్టును ఆంధ్రప్రదేశ్ అంతటా అమ్మటానికి ఒక వ్యాన్, వ్యాన్ నడుపుటకు డ్రైవర్, ఖర్చులకి కొంచెం డబ్బులు, కృపాదానంగారికి మంచి జీతం ఏర్పాటు చేశారు. అన్ని విషయాలలో సమృద్ధి ఉన్నప్పటికి ఆ దంపతులు మనస్సులోవేదన కలిగి ఉండేవారు. హన్నమ్మగారు టీచర్ ఉద్యోగం చేస్తుంది. కాని సేవ చెయ్యాలనే మనస్సాక్షి గద్దింపుతో జీవించసాగారు. సెమినరి చదివి, కొంతకాలం దేవుని సేవ చేసిన కృపాదానంగారు ప్రతి పట్టణంలో, గ్రామంలో తిరుగుతూ ప్రతి దుకాణమునకు వెళ్ళి తన ఉద్యోగం చేస్తున్న కంపెని గురించి వారి వస్తువులను గురించి గొప్పగా చెబుతూ డబ్బు సంపాదిస్తున్నాడు. ఈ పని దేవుని సేవ కొరకు, ప్రజల రక్షణానుభవము కొరకు చేస్తే దేవుడు తనకు తన కుటుంబానికి ఆహారం పెట్టడా? అని ఆలోచిస్తూనే రెండు భారమైన సంవత్సరాలు గడిపారు. చివరికి తెగించి ఒక రోజున వారిద్దరి సంపాదనను వదులు కొని, సంచులలో బైబిల్ పెట్టుకొని ఒంగోలులో సువార్త సేవ ప్రారంభించారు. అప్పటికే ఒంగోలులో ఐదు మిషనెరీ కుటుంబాలు ఉన్నాయి. ఆ మిషనెరీలకు కోపం వచ్చింది. కృపాదానంను పిలిపించి నువ్వు దేవుని నామానికి అవమానం తెస్తున్నావు. ఇద్దరు ఉద్యోగాలు మానివేస్తే నీ బిడ్డలు అన్నవస్త్రాలకు అల్లాడితే అది దేవునికి అవమానము కాదా అన్నారు. అయినా కృపాదానం దంపతులు ఎవరి మాటను లెక్కచేయక దేవుని సేవ చేయుటకు నిశ్చయించు కొనినారు.

హెచ్.సి.యం.లో క్రిస్మస్ పండుగకు క్రొత్త బట్టలు అంటే అమెరికా నుండి వచ్చిన బట్టలు ఇస్తున్నారు. అప్పుడు కృపాదానం కుమార్తె అరుణకు పది సంవత్సరాలు. ఆమె తన పేరు ఎదురుగా దేవుడే ఇస్తాడు అని వ్రాసింది. అది చూసిన మిషెనరీ భార్య అరుణకు బట్టలు ఇవ్వలేదు. అరుణ ఏడుస్తూ ఇంటికి వచ్చింది. సంగతి తెలుసుకున్న కృపాదానం, దేవుడు ఇంకా మంచి బట్టలు ఇస్తాడమ్మా అని చెప్పాడు కుమార్తెకి. అరుణకి మిషనెరీ భార్య స్కూలులో బట్టలు ఇవ్వ లేదని తెలుసుకున్న క్లౌ మెమోరియల్ హాస్పిటల్ డాక్టరమ్మ మంచి డ్రస్‌లు కొని అరుణకు ఇచ్చింది. **( సశేషం)**

**(17వ పేజీ తరువాయి...)**

కొంతకాలానికి సాధారణమైన చేపలుపట్టే వారికి అనువైన దోనెగా ఉన్న రెండవ చెట్టులోకి కొంతమంది ఎక్కారు. వారిలో ఒకడు అమరమున నిద్రపోతుండగా సముద్రం మీద పెద్దగాలి వాన లేచింది. మిగిలినవారు ప్రభువా నశించిపోతున్నాం రక్షించ మనగానే నిద్రపోతున్న యేసు లేచి గాలిని సముద్రాన్ని గద్దించి నిమ్మళింపజేశాడు. రాజులకంటే రాణులకంటే ఘనుడైన వానిని రాజులరాజు ప్రభువుల ప్రభువును మోసుకెళ్తు నందుకు తన కల నెరవేరిందని సంతోషించింది రెండవచెట్టు.

ఇంకొంత కాలానికి చీకటిలో నిరుపయోగంగా ఉన్న మూడవ చెట్టు దూలాలు వెలుగులోకి తేబడ్డాయి. వాటితో ఒక సిలువ చేయబడింది. దానిని మోస్తున్న వ్యక్తిని అందరూ హేళనగా చూస్తు ఎగతాళి చేస్తున్నారు. ఇదంతా చూస్తున్న మూడవ చెట్టు సిగ్గుతో చచ్చిపోయింది. కాని ఆదివారం తెల్లవారే సరికి ఆ సిలువ ప్రపంచ మానవాళిని స్వర్గానికి తీసుకెళ్ళే ఒక మార్గంగా అత్యంత ఎత్తులో నిలుపబడింది. అందరి కంటే స్వర్గానికి అతి చేరువలో తనే ఉన్నందుకు, ప్రజలు పరలోకం గురించి ఆలోచించిన ప్రతిసారి సిలువను అంటే తననే జ్ఞాపకం చేసుకుంటారని తెలుసుకొని తన కల నెరవేరినందుకు సంతోషించింది మూడవ చెట్టు.

మనం కూడ అనేక రకాల కలలతో కోరికలతో జీవిస్తుం టాము. మన కలలు నెరవేరలేదని బాధపడుతుంటాము కాని దేవుని మీద నమ్మిక నిరీక్షణ ఉంచితే ఖచ్చితంగా దేవుడు కథలోని మూడు చెట్ల కలలను నెరవేర్చినట్లు మన కలలు నెరవేరుస్తాడు. మనం ఊహించినదానికంటే ఆశించిన రీతి కంటే కూడ గొప్పగా మన కలలను నెరవేర్చగల సమర్థుడు మన ప్రభువు. కాబట్టి ఎన్నడు కూడ నీవున్న పరిస్థితులనుబట్టి నిరాశచెందక ఎటువంటి పరిస్థితికైన సరిపోయే ఆ దేవదేవునిపై నిరీక్షణ ఉంచి సంతోషంగా జీవిద్దాం.

*"నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులను నేనెరుగుదును, రేపోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములేగాని హానికరమైనవి కావు" యిర్మీయా 29:11*

# మనల్ని మనం పరీక్షించుకోవాలి

చాలాసార్లు మనకి మనం చాలా గొప్ప విశ్వాసము కలిగియున్నామని భావిస్తుంటాము. అంటే మన విశ్వాసం మనకి చాలా గొప్పగా కనబడుతుంటుంది. కాని అది దేవుని దృష్టికి సరిపడునంతగా ఉందో లేదో మనకు తెలియదు. ఉదాహరణకి మన అవసరాలకి మనం దేవుని మీద ఆధారపడేటప్పుడు, లేదా మన శక్తికి మించినది దేవుని ద్వారా పొందాలనుకొనేటప్పుడు, లేదా గత్యంతరంలేని పరిస్థితుల్లో దేవున్ని ఆశ్రయించినప్పుడు దానిని మనం విశ్వాసమని భావిస్తుంటాము. దేవుడు మనకి కీడు చెయ్యడు మేలే చేస్తాడు అనుకోవడం, దేవుడు మనకు సమస్తము అనుగ్రహిస్తాడు, మనల్ని ఇబ్బంది పడనీయడు అనుకొని విశ్వసించడం అది విశ్వాసం కాదు. దేవుడు మనల్ని ఏ స్థితిలో ఉంచినా, ఏమి చేసినా, చివరికి చావడానికి కూడా సిద్దపడి దేవున్ని నమ్మడమే నిజమైన విశ్వాసం. దేవుడు మనల్ని పేదరికంలో ఉంచుతాడు, మనల్ని పస్తు పెడతాడు, మనకు ఎలాంటి మేలు చేయడు అనుకొని ఎంతమంది దేవున్ని విశ్వసిస్తారో మనం ఆలోచించాలి. మనకు మేలు జరిగితే దేవున్ని విశ్వసించడం, కీడు జరిగితే దేవున్ని నిందించడమనేది విశ్వాసము కాదు. దేవున్ని గుడ్డిగా నమ్మడమే నిజమైన విశ్వాసము. దేవుడు అబ్రాహామును తన ఒక్కగానొక్క కుమారుడుని బలి ఇవ్వమని అడిగినప్పుడు ఒక్కమాట కూడా మాట్లాడకుండా తన కుమారుడుని బలి ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. 'అదేంటయ్యా, నువ్వే కదా నీ సంతానము ఇసుక రేణువుల్లా, ఆకాశ నక్షత్రాల్లా నీ సంతానము ఉంటుందన్నావు కదా మరి ఇప్పుడు నా కుమారుడ్ని బలి ఇవ్వమంటున్నావని' సణుగుకోలేదు. ఎందుకంటే స్త్రీ ధర్మము నిలిచిన శారా మృతతుల్యమైన గర్భములో నుండి జీవమును పుట్టించిన దేవునికి అసాధ్యమైనది ఏదీ లేదని అబ్రాహాము హృదయపూర్వకంగా నమ్మాడు. చర్చికి వెళ్తేనో, బైబిలు చదివితేనో, ప్రార్థన చేసుకుంటేనో విశ్వాసులము అవ్వము. మన విశ్వాసము పరీక్షింపబడి అందులో మనం విజయం సాధిస్తేనే విశ్వాసులమవుతాము. శోధనలచేత మన విశ్వాసము పరీక్షిపబడకపోతే మన విశ్వాసమునకు విలువ లేదు. దేవుడు అందరినీ శోధించడు గానీ, ఎవరైతే శోధనల ద్వారా పరీక్షింపబడటానికి అర్హులో వారినే శోధిస్తాడు. శోధింపబడుటకు తగినంత విశ్వాసం మనకి వుంటేనే దేవుడు మనల్ని పరీక్షిస్తాడు. పరీక్షలో మనం నెగ్గినప్పుడు దేవుని యెదుట మనకు మెప్పు కలుగుతుంది. *'నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధపరచబడుచున్నది గదా? దానికంటె అమూల్యమైన మీ విశ్వాసము ఈ శోధనల చేత పరీక్షకు నిలిచినదై, యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పును మహిమయు ఘనతయు కలుగుటకు కారణమగును' (1పేతురు 1:7).* శోధనల ద్వారా పరీక్షింపబడుటకు తగిన విశ్వాసం మనకి ఉందో లేదో, అది దేవుని దృష్టికి అంగీకార యోగ్యంగా ఉందో లేదో బైబిలు ద్వారా సరిచూసుకుందాం.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి... www.onlinetelugubible.net

**www.onlinetelugubible.net**

# దేవుడు - సిరి

జాగ్రత్త పడుడి! అని యేసుప్రభువు చెప్పాడు. జాగ్రత్త పడుడి అంటే అపాయము పొంచి వున్నది అని హెచ్చరిక. యేసుప్రభువు ఈ విషయం చెప్పినప్పుడు, ఒక వ్యక్తి వచ్చి తన సహోదరుడు పిత్రార్జితములో తనకు రావలసిన భాగమును ఇవ్వడం లేదని చెబుతున్నాడు. ఇందులో దేవుని కేమి సంబంధం లేదు. కనీసం ప్రభువు అతని ఓదార్చినట్లుగా కూడా కనబడటం లేదు. పైగా మీకు తీర్పు తీర్చటానికి నన్నెవరు నియమించారు? అంటున్నాడు. ఆ వ్యక్తి ఆస్థికోసం ఎంతమంది చుట్టూ తిరిగాడో ఎన్ని అవస్థలు పడ్డాడో, చివరికి యేసుప్రభువుకు చెబితే ఆయన సహాయం చేస్తాడని అనుకున్నాడు. ఆస్థిలో భాగం, ఆస్థి కొరకు పోరాటం ఈ విషయాలు వినటానికి కూడా ప్రభువుకు ఇష్టంలేనట్లుగా ఉంది. తన మాట వినేవారు, తను చెప్పినట్లుగా జీవించాలి అనుకొనే వారందరి కొరకు యేసు మీరు ఏ విధమైన లోభమునకు చోటివ్వకుండా జాగ్రత్త పడుడి అంటున్నాడు. తన దగ్గరకు వచ్చిన వ్యక్తికి ఆకలిగా లేదు. అతడు అన్ని విషయాలలో కలిగి వున్నవాడైనను తనకు తండ్రి వలన వచ్చే ఆస్థి కావాలి.

ఈ లోకములో ఎవరైనా నీకు అన్యాయము చేస్తే అంటే నీ మీద వ్యాజ్యము వేసి నీ అంగీని తీసుకొన గోరిన యెడల వానికి నీ పైవస్త్రమును కూడా ఇచ్చివేయుము అని మత్తయి వ్రాస్తే, నీ పైబట్ట ఎత్తుకొని పోవు వానికి నీ అంగీని కూడా ఎత్తుకొనిపోకుండా అడ్డగించకుము అని లూకాలో వ్రాయ బడింది. నిన్ను అడుగు ప్రతివానికి ఇమ్ము. నీ సొమ్ము ఎత్తుకొని పోవు వానియొద్ద దాని మరల అడుగవద్దు. ఈ మాటలు నీ తమ్మునికో, నీ అన్నకో, నీ తండ్రికో, నీ పొరుగు వానికో చెబితే నీకు పిచ్చిపట్టింది అని అంటారు. యేసు ప్రభువును తన సొంతవాళ్ళే ఆ మాట అన్నారు (మార్కు 3:21). ఈ మాటలు మనలను ఆచరించమని యేసుప్రభువు చెప్పాడు. యేసు మాటలను మనం మన జీవితంలో నెరవేర్చ పూనుకుంటే మనం ధనము, ఆస్థి కూర్చుకోవటం మానివేస్తాం, దాని విషయం ఆలోచించము.

నిన్ను అడుగు ప్రతివానికి ఇమ్ము, నీకు మరల తిరిగి ఇస్తాడని కాదు. యేసు చెప్పాడు కనుక యేసుకు ఇస్తున్నా మని గ్రహించాలి. అణచి కుదిలించి దిగజారునట్లు ఆయన మనకు తిరిగి ఇస్తాడు. ఇది ఆయన వాగ్దానము.

ఒక ధనవంతునికి భూమి సమృద్ధిగా పండిందంటే అది వాని మహత్యం కాదు. అతను నేలలో పెట్టిన గింజను ముప్పదంతలుగాను, అరువదంతలుగాను, నూరంతలు గాను ఫలింపజేసింది ప్రభువే. మనం సమృద్ధి కలిగి ఉన్నామంటే అది మన కష్టం, మన తెలివి, మన జ్ఞానము వలన కాదు. ప్రభువు ఇచ్చాడు. కాబట్టి ప్రభువు చెప్పిన విధముగా చెయ్యాలి. అలా కాకుండా ఇదంతా నాకు, నా కుటుంబానికి దేవుడిచ్చాడు, ఇంట్లోకి నేనేమి తేవాలి? కొత్త ఇల్లు కట్టించుకోవాలి అని సొంత పనులను గూర్చి ఆలోచించకూడదు. యేసు ఐదు రొట్టెలను రెండు చేపలను పట్టుకొని ఆకాశము వైపు కన్నులెత్తి ఆశీర్వదించి, ఆ రొట్టెలను విరచి, అందరికి వడ్డించుటకు తన శిష్యుల చేతికిచ్చాడు. మనకు దేవుడు సమృద్ధిగా ఇచ్చేది, ఇతరులకు పంచటానికి. మన ఇంటికి వచ్చిన వారికి ఇవ్వటానికి దేవుడు మనకు కొంత ఇస్తే అది నాది, నా కుటుంబానిది అని, వచ్చిన వారిని చూసి విసుక్కొని రేపటి కొరకు డబ్బు దాచుకుంటున్న నీకు ఆ రేపు లేకపోతే... దేవుడు మనలను చూచి వెర్రివాడా... ఈ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నారు అంటున్నాడు. అంటే రేపు దేవునిది. కాబటి దేవుని నమ్మి ఆయనపై ఆనుకొని దేవుడు నీకిచ్చిన తలాంతులను వాడు. భూమి(బ్యాంకు)లో దాచుకోవద్దు. ప్రభువు మనకు డబ్బులు ఇవ్వాలని సమృద్ధిగా ఇవ్వాలని కోరుకుంటాము, ప్రార్థిస్తుం టాము. కాని ఆయన ఇచ్చిన దానిని ఆయన చెప్పిన రీతిలో కాపాడుకొనమంటే అది పద్ధతి కాదు.

# లోకంతీరు

**(పుట్టుక చావు మధ్య సంబరం)**

మన శరీరము మీద దేవునికి పూర్తి హక్కు ఉంది. అయినప్పటికీ దేవుడు మనల్ని ప్రేమించటం వలన మనకి పూర్తి స్వేచ్ఛని ఇచ్చాడు. మనం స్వచ్ఛందంగా ఆయన దగ్గరకి రావాలని కోరుకుంటున్నాడు. అయితే మనిషి సాతాను పన్నిన వలలో మనిషి చిక్కుకుని సాతానుకు బంధీగా బ్రతుకుతున్నాడు. మనుష్యుల బలహీనతలను గ్రహించిన దేవుడు తన బిడ్డలైన ఎంతో మంది ద్వారా విడిపించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. అయితే మనుష్యులు తమ హృదయ కాఠిన్యముచేత, ఈ లోక ఆశలైన శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము అను వాటికి బంధీగా చిక్కుబడిపోయాడు.

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

మనిషిని పుట్టించిన దేవుడు వారి మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటే మనుష్యులు దేవుని మీద తిరుగబడ్డారు. ఆందుకే దేవుడు యెషయా 1:2లో ప్రకృతితో ***"ఆకాశమా, ఆలకించుము; భూమీ, చెవియొగ్గుము. నేను పిల్లలను పెంచి గొప్ప వారినిగా చేసితిని వారు నా మీద తిరుగబడి యున్నారు"*** అని తన బాధనంతా చెప్పుకుంటున్నాడు. ఎంత ఆశ్చర్యము. ఒక్క క్షణంలో మానవ జాతినంతా మసి చెయ్యగల శక్తిగల దేవాది దేవుడు ఒక సామాన్యుడిలా ఎంతగా బాధపడుతున్నాడో చూస్తే దేవుడు మనిషిని ఎంతగా ప్రేమిస్తున్నాడో అర్థం అవుతుంది. మన పుట్టుక వలన మనము సంతోషంగాలేము, దేవుడిని సంతోషపెట్టటం లేదు. తల్లి గర్భంలో ప్రవేశపెట్టబడిన కొన్ని కోట్ల మందిని కాదని నిన్ను నన్ను ఎన్నుకుంటే చివరికి మనం దేవునికి మిగిల్చింది వేదన మాత్రమే.

ఈ భూమి మీద పుట్టిన ప్రతి మనిషి చనిపోవడం అనివార్యం. ఈ భూమి మీద మనిషి జీవితానికి ముగింపే చావు. దేవుడు నరుని చేసినప్పుడు అతనికి మరణము నిర్ణయించబడలేదు. తన స్వరూపము చొప్పున, తన పోలికె చొప్పున తన స్వహస్తాలతో నిర్మించుకున్న మనిషి చనిపోవాలని కోరుకుంటే దేవుని ప్రేమకు అర్థం లేదు. దేవుడు మనిషిని ప్రేమించి యిచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం వలన సంక్రమించినదే చావు. నరుడు దేవుని ప్రేమను అర్థం చేసుకోలేకపోవడం వలన, దేవుని హెచ్చరికను నిర్లక్ష్యం చేయడంవలన, దేవుని ఆజ్ఞను పాటించక పోవడం వలన చావు మనిషి జీవితంలోకి ప్రవేశించింది.

దేవుడు మనిషిని ఎంత ప్రేమించాడో మనిషిని తన స్వహస్తాలతో నిర్మించడం ద్వారా చూపించాడు. సృష్టి యావత్తును తన నోటి మాట ద్వారా సృష్టించిన దేవుడు మనిషిని మాత్రం తానే స్వయంగా నిర్మించి, తన నాసికా రంధ్రాలలో జీవవయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయ్యాడు. తన స్వరూపము, తన పోలికెగా నిర్మించిన మనిషి కోసమే ఈ సృష్టి యావత్తును చేశాడంటే దేవుడు మనిషికి ఎంత విలువ ఇచ్చాడో అర్థమవుతుంది. మనిషిని చేసిన తర్వాత, మనిషి యొక్క అవసరతలు ఏంటో తెలుసు కొని, సృష్టిని చెయ్యలేదు. మనిషికి ఏమేమి అవసరమో, వాటన్నిటిని ముందుగానే సృష్టించి, తాను చేసినవి మంచిది అనిపించిన తర్వాతనే మనిషిని సృజించాడు దేవుడు. మనిషిని సృష్టించిన తర్వాత ఇంక ఎలాంటి వాటిని మనిషి కోసం సృష్టించలేదు. మనిషి ఈ భూమ్మీద బ్రతకటానికి తాను సృష్టించినవి తప్ప ఇంకేమి అవసరం లేదని దేవుడు భావించాడు. తను ఎంతో ప్రేమంచి, తన కోసం ఏర్పరచు కున్న మనిషి కోసం సృష్టించే ప్రతిదీ మనిషి ఎంతో ఇష్టపడాలన్న తాపత్రయంతో ప్రకృతి అందాలతో ఈ సృష్టిని చేశాడు దేవుడు. మనం ఎంతో ఇష్టపడే వాళ్ళు మొదటిసారి మన ఇంటికి వస్తారని తెలిసినప్పుడు, ఇంటిని బాగా శుభ్రం చేసి, అలంకరించి,

వారికి ఇష్టమైన భోజన పదార్థములను తయారుచేసి, వారిని మెప్పించాలని ఉబలాటపడటం వారి మీద మనకున్న ప్రేమని తెలియచేస్తుంది. అలాగే దేవుడు కూడా మనుష్యుల కోసం సృష్టిస్తున్న ఈ లోకాన్ని ఎంతో అందంగా, ఉపయోగకరంగా సృష్టించి మనుష్యులను తాను ఎంతగా ప్రేమిస్తున్నాడో తెలియజేశాడు.

అయితే తాను ఇంతగా ప్రేమిస్తున్న మనుష్యులు తన పట్ల ఎలాంటి భావము కలిగియున్నారో తెలుసుకోవాలని అనుకున్నాడు. తినడానికి ఎటు చూసినా పండ్లతో నిండిన పచ్చని చెట్లు, అందమైన ప్రకృతి, అంతకంటే అందమైన భార్య, జంతువులు, పక్షులు, తోటలో ప్రవహించే నదులు, ఇంతటి మంచి జీవితం ఇచ్చిన దేవుని పట్ల మనిషి కృతజ్ఞతా భావముతో ఉన్నాడో లేదో దేవునికి తెలుసు వాలనిపించింది. అందుకే మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టుని వేశాడు. దానితో పాటు జీవవృక్షఫలము చెట్టు కూడా వేశాడు. అయితే మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలము మాత్రము తినవద్దని చెప్పాడు. దానిని తిను దినమున నిశ్చయముగా చనిపోతారు అని హెచ్చరించాడు. తినడానికి ఎన్నో పండ్లనిచ్చాడు, ఏ చెట్టు ఫలమునైనా నిరభ్యంతరంగా తినమని చెప్పాడు, జీవవృక్ష ఫలము కూడా తినవచ్చును. కేవలం ఒకే ఒక్క చెట్టు ఫలము మాత్రం తినవద్దని చెప్పాడు. తినడం అనేది ఆకలికి సంబంధించింది. ఆకలి అయినప్పుడు దేవుడు వారికిచ్చిన ఫలాలతో కడుపు నింపుకోవచ్చు. దేవుడు తినవద్దని చెప్పిన ఫలము తినాల్సిన అవసరత ఏమీ లేదు.

అయినప్పటికీ, దేవుని హెచ్చరికను కాదని తమకు అవసరం లేనిదానిని కోరుకొని చావు కొని తెచ్చుకున్నారు. దేవుని మాట వినకుండా సాతాను మాట విని దేవుని ఆజ్ఞను మీరటం వలన మనిషి జీవితంలోకి చావు ప్రవేశించింది. ఆజ్ఞ అతిక్రమము పాపము కాబట్టి, వీరు దేవుని ఆజ్ఞను మీరి పాపము చేసినందువలన వారి జీవితాలకు రోజులు మొదలయ్యాయి. తాను నిర్మించుకున్న మనిషి తనకు లోబడి, తన మాట విని నిరంతరం జీవించాలని కోరుకున్న దేవుని ఆశలని నీరుగార్చి దేవునికి మనోవేదన కలిగించిన మనిషి, కష్టాలతో పాటు తన జీవితానికి అంతమైన చావుని తన జీవితములోనికి తనకు తానుగా ఆహ్వానించుకున్నాడు.

**చా వు**

**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

ఆది దంపతులైన ఆదాము, హవ్వల ద్వారా సర్వమానవాళికి సంక్రమించిన ఈ చావు మనుష్యులను దుఃఖ సంద్రములో ముంచివేస్తుంది. మరణము చాలా భయంకరమైనది. చావుకి పక్షపాతము లేదు. ప్రతి ఒక్కరిని సమానంగా చూస్తుంది. పేద, గొప్ప, కులము, మతము, వర్ణము అన్న బేధము లేకుండా అందరికీ వర్తిస్తుంది. కొన్ని కోట్ల ఆస్తి ఉన్నవాడు కూడా చావాల్సిందే. చావంటే అందరికీ భయమే. చావకుండా వుండటానికి ఎంతో డబ్బు ఖర్చు చేస్తారు. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు అయినా చచ్చిపోతారు. విచిత్రమేమిటంటే, నేను చస్తాను కదా అని చచ్చే వరకు చావు గురించి ఎవ్వరూ ఆలోచించరు. అందుకే చచ్చేదాక చాలా ధీమాగా బ్రతుకుతుంటారు. మేమెప్పటికీ చావము అన్నట్లు డబ్బు సంపాదించటంతోనే కాలం వెళ్ళబుచ్చుతుంటారు. ఒకవేళ ఎవరైనా మేము ఎప్పుడు చనిపోతామో తెలియదు కదా అని ఆలోచిస్తే డబ్బు కూడబెట్టుకోవాలన్న ఆసక్తి కనుపరచరు. చాలామంది డబ్బు సంపాదించటానికి తమ బ్రతుకును వెళ్ళబుచ్చుతుంటారు.

కీర్తనలు 90:10లో వ్రాయబడిన ప్రకారము నరుల ఆయుష్కాలము డెబ్బై సంవత్సరాలు అని, ఒకవేళ అధిక బలముంటే ఎనభై సంవత్సరాలు అని దైవజనుడైన మోషే తన ప్రార్థనలో తెలియజేశాడు. అయితే దేవుడు ఇచ్చిన ఆయుష్కాలము అంతా అనుభవించకుండానే అర్ధాంతరంగా చనిపోయే వాళ్ళు ఉన్నారు. వారి వారి క్రియల ఫలితంగా మనుష్యులు చావు దగ్గరకు పోతుంటారు. దేవుడు వారికిచ్చిన ఆయుష్షుని వారే తగ్గించుకుంటారు. **(ఇంకా వుంది)**

# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 8

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | | ■ | 4 | ■ | 5 |
| ■ | | ■ | | ■ | 6 | | | |
| 7 | | | | ■ | ■ | | ■ | |
| ■ | | ■ | 8 | 9 | | | | |
| 10 | ■ | 11 | ■ | | ■ | | ■ | |
| 12 | | | | | 13 | ■ | 14 | ■ |
| | ■ | | ■ | ■ | 15 | | | |
| 16 | | | | ■ | | ■ | | ■ |
| | ■ | | ■ | 17 | | | | |

**అడ్డం :**

1. ఏథెన్సులో కొందరు పౌలును ఇలా అన్నారు (4) (అపొ)
6. యెహు ఎవరి మీద కుట్ర చేసెను (4) (2రాజులు)
7. నేను న్యాయము----(4) గాను నీతి మట్టపుగుండు గాను పెట్టెదను (తారుమారు) (యెషయా)
8. తిరగబడిన ఉరిమెడివారు (6) (మార్కు)
12. బైబిల్లోని కవలలలో రెండవ జంట (6) (ఆది)
15. బలవంతులైన 128 మందికి పెద్ద (4) (నెహె)
16. నీ జల ప్రవాహధారల ధ్వని విని కరదు ---- (4) పిలుచుచున్నది (కీర్తనలు 42)
17. నా ------ (5) నీ వశములో ఉన్నవి. (తారుమారు) (2 కీర్తనలు)

**నిలువు :**

2. 4వేల మందికి భోజనం పెట్టాక యేసు ఈ ప్రాంతములకు వచ్చెను (4) (మార్కు)
3. నిన్ను గూర్చియు నీ ---గూర్చియు జాగ్రత్త కలిగి యుండుము (4) (బహువచనం) (1తిమోతి)
4. 'కొం' 'ద' మధ్య దేవుని పర్వతము (5) (నిర్గమ)
5. తారుమారైన ఎల్యాకీము మారుపేరు (5) (2రాజులు)
9. ఆభరణములచేత నీ చెక్కిళ్ళును ---- (3) ల చేత నీ కంఠమును శోభిల్లుచున్నవి. (పరమ) (తారుమారు)
10. యేసు అరషెకెలు పన్ను కట్టిన పట్టణం తారుమారైంది (5) (మత్తయి)
11. శిర్వాసనమేసిన బీదవిధవరాలి కానుక (5)
13. తారుమారైన అబీమెలెకు స్నేహితుడు (4) (ఆది)
14. తారుమారైన హన్నా కుమారుడు (4)

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 7 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ర | 2 కొ | తి | 3 మె | ■ | 4 ఆ | ల | 5 య | 6 ము |
| 7 బ్బీ | ర | ■ | 8 రీ | క్ష | ప | ■ | 9 క | ద్దు |
| ■ | 10 కు | 11 రా | బా | ■ | 12 ద | 13 ము | పా | ■ |
| 14 జ | ■ | తి | ■ | 15 సో | ■ | సం | ■ | 16 ఐ |
| 17 గ | యే | లు | బ్రి | ■ | 18 అ | రా | రా | తు |
| త్తు | ■ | త్తు | ■ | 19 నో | ■ | ధ్యా | ■ | కు |
| ■ | 20 ము | క | 21 లు | ■ | 22 రు | గ | 23 హో | ■ |
| 24 ఒ | మ్రో | ■ | 25 గు | రు | గు | ■ | 26 నో | 27 ట |
| 28 తి | ని | న్న | ది | ■ | 29 చి | ల్ల | కు | పెం |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 7**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం
2. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
3. డి. సురేష్ కుమార్, రెంపడం, విజయనగరం
4. జి.యస్.యస్. ప్రసాద్, వైజాగ్
5. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
6. టి. సుదర్శన్, నంద్యాల